

వైసీపీ చిత్తం

మచిలీపట్నం కార్పొరేషన్‌లో ఆ పార్టీదే హవా



మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

- ప్రభుత్వం నుంచి వస్తున్న కీలక సమాచారం బయటకు..
- పట్టాభి స్మారక భవన నిర్మాణం తీర్మానానికి అడ్డంకులు
- వైసీపీ ప్రభుత్వ హయాంలో అవినీతి బాగోతాలెన్నో..
- కూటమి ప్రభుత్వం వచ్చినా జరగని విచారణ
- వైసీపీ పాలకవర్గ సభ్యులు ఎక్కువగా ఉండటం వల్లే..
- సహకరిస్తున్న కొందరు అవినీతి అధికారులు

మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో పాలన వైసీపీ చిత్తంగా సాగుతోంది. టీడీపీ కూటమి నాయకుల మాటలు వినే పరిస్థితి లేకుండాపోయింది. వైసీపీ పాలకవర్గ సభ్యుల ఇష్టానుసారంగా అంతా జరుగుతుండటంతో కార్పొరేషన్‌లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, పరిపాలనాపరమైన అంశాల్లో ఇబ్బందులు తొలగట్లేదు. కాంట్రాక్టు పనులను సైతం ఆ పార్టీ నాయకులే చేజిక్కించుకుంటున్నారు. వైసీపీ పాలనలో హవా సాగించిన అధికారులు, సిబ్బంది నేటికీ పాత పద్ధతిలోనే వ్యవహరిస్తున్నారు. ముగ్గురు కూటమి నాయకులు కార్పొరేషన్ పరిపాలనలో పట్టు సాధించేందుకు ప్రయత్నించినా, అధికారులు, సిబ్బంది మాత్రం పైకి తలలూపుతూ.. ఆ తరువాత వైసీపీ నాయకులకే దాసోహమంటున్నారు.

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో వివిధ అభివృద్ధి పనులకు, పరిపాలనాపరమైన అంశాలకు సంబంధించి మంత్రి కార్యాలయం నుంచి, ప్రభుత్వం నుంచి ప్రతిపాదనలు, సూచనలు వస్తే ఆ సమాచారం గంటల వ్యవధిలోనే బయటకు వస్తోంది. కీలకపత్రాలను జిరాక్స్ తీస్తున్న కార్యాలయ ఉద్యోగులు ప్రతిపక్ష వైసీపీ నాయకులకు ఇస్తుండటం వివాదాస్పదమవుతోంది. ఇక్కడ పనిచేసే కొందరు ఉద్యోగుల అత్యుత్సాహమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

పట్టాభి స్మారక భవనం నిర్మాణానికి తీర్మానమేదీ?

ఆంధ్రాబ్యాంకు వ్యవస్థాపకుడు డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య స్మారక భవనం నిర్మాణం కోసం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రూ.40 కోట్లు కేటాయించింది. స్థానిక సాయిబాబా గుడి వెనుక భాగంలో రెండెకరాల భూమిని కేటాయించారు. నిర్మాణానికి అనుమతులు ఇస్తూ మున్సిపల్ కార్పొరేషన్ తీర్మానం చేయాలి. అలా చేయకపోవడంపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలైనా కార్పొరేషన్ సమావేశాల్లో ఈ అంశంపై తీర్మానం చేయకుండా జాప్యం చేయడం గమనార్హం. పాలకవర్గంలో వైసీపీ సభ్యులే అధికంగా ఉన్నారనే కారణం చూపి అధికారులు ఈ అంశాన్ని పక్కన పెట్టేస్తున్నారు.

టౌన్‌ప్లానింగ్‌లో ఆయనదే హవా

టౌన్‌ప్లానింగ్ విభాగంలో తొమ్మిదేళ్లు ఒకే సీటులో సహాయ అధికారిగా ఒక ఉద్యోగి పనిచేస్తున్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారిగా ఎవరొచ్చినా ఈ ఉద్యోగి చెప్పిందే వేదంగా నడుస్తోంది. వైసీపీ హయాంలో ఈ ఉద్యోగి చేసిన అక్రమాలు అనేకం. కానీ, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ ఉద్యోగిని ఆ సీటు నుంచి వేరే సీటుకు బదిలీ చేస్తారని అంతా అనుకున్నారు. నగరంలో 300 గజాలకు పైగా విస్తీర్ణంలో

మిగతా 6లో..

అక్రమ విక్రయాలపై విచారణేదీ..?

వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో నగరంలో వీధి దీపాల కొనుగోలులో భారీ అవినీతి జరిగింది. రూ.800 ఖరీదుచేసే ఒక్కో విద్యుత్ లైటును రూ.2,500గా చూపించి కొన్నారు. రూ.10 లక్షల విలువైన విద్యుద్దీపాలను కొన్నట్టు బిల్లు చూపారు. అలాగే, వాటర్‌వర్క్స్ విభాగంలో రాగి, విద్యుత్ వైర్లు, విద్యుత్ మోటార్లు, ఖరీదైన వాల్వ్‌లు, ఇతర విలువైన వస్తువులను పాత ఇనుముగా చూపి మూడు లారీల సరుకును విక్రయించేశారు. ఈ రెండు అంశాలపై అప్పట్లో ప్రతిపక్ష హోదాలో ఉన్న టీడీపీ నాయకులు పలుమార్లు ఫిర్యాదులు కూడా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక ఈ అంశాలపై విచారణ చేయకుండా కొందరు తెరవెనుక చక్రం తిప్పుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.



అరిపిరాల చప్టా పక్కన బుడమేరు గట్టు దుస్థితి

బుడమేరు గట్టుకు ప్రమాదం

- వైసీపీ పాలనలో గుడివాడలో పటిష్టత పనులు
- నిర్లక్ష్యంగా నిర్వహించిన కాంట్రాక్టర్
- జారిపోతున్న మట్టి.. ఒరిగిపోతున్న స్తంభాలు

ఆందోళనలో గుడివాడ రైతులు

6లో

ఎంత ఘాటుప్రేమో..



దుర్గగుడి ఘాట్‌రోడ్డు టోల్, పార్కింగ్‌లో కాంట్రాక్టర్‌కు అధికారుల దాసోహం

- రెండేళ్లకు టెండర్.. ఒక ఏడాదే చెల్లింపులు
- మరో ఏడాది ఉచితంగా నెట్టుకొచ్చే ప్రయత్నాలు
- దేవస్థానానికి కాంట్రాక్టర్ చెల్లించాల్సినది రూ.2.06 కోట్లు
- ఈ చెల్లింపులేమీ లేకుండా 'ఉచిత' అవకాశం
- ఆరు నెలల ఉచితంతో పాటు కార్పొరేషన్ స్థలంలో పార్కింగ్ ఫ్రీ
- స్వయంగా దేవదాయ కమిషనర్‌కు దుర్గగుడి అధికారుల లేఖ
- తాజాగా మరో రెండు నెలలు ఉచితం కావాలట..!



శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం టోల్‌గేట్, పార్కింగ్ వసూలు కాంట్రాక్ట్ సంస్థపై అధికారులు 'ఘాటు'ప్రేమను చూపిస్తున్నారు. దేవస్థానానికి చెల్లించాల్సిన సొమ్మును ముక్కుపిండి వసూలు చేయాల్సిన అధికారులు.. కాంట్రాక్ట్ సంస్థపై ప్రేమను పెంచుకుని 'ఉచిత' వెసులుబాటు కల్పించారు. కాంట్రాక్ట్ నిర్వాహకులు చేసిన ప్రతిపాదనలను పరిశీలించుకోకుండా, వాటిపై పునరాలోచన లేకుండా తలలూపడమే కాదు.. సదరు ప్రతిపాదనలను కమిషనర్ కార్యాలయానికి పంపి ఆమోదముద్ర కూడా వేయిస్తున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కనకదుర్గానగర్‌లోని పార్కింగ్, ఘాట్‌రోడ్డు టోల్ వసూలు కాంట్రాక్టును దక్కించుకున్న సంస్థపై అధికారులు వ్యవహరిస్తున్న తీరు వివాదాస్పదంగా మారుతోంది. ఘాట్‌రోడ్డులో ఓం మలుపునకు ముందు, కనకదుర్గానగర్‌లో వాహనాల పార్కింగ్‌ను కాంట్రాక్టుకు ఇస్తుంటారు. దీనికి 2023, మార్చి 15న నోటిఫికేషన్ ఇచ్చారు. 27న ఈ-టెండర్లు, సీల్డు టెండర్లు, బహిరంగ వేలం నిర్వహించారు. నోటిఫికేషన్‌లో మొత్తం 34 షరతులు పెట్టారు. రెండేళ్ల కాలపరిమితికి టెండర్ నిర్వహించారు. సీల్డు టెండర్‌లో నగరానికి చెందిన వీఎల్‌డీ ఏజెన్సీ అధినేత పీవీఎల్ దేవి రూ.కోటీ58లక్షల99వేల999కు టెండరును దక్కించుకున్నారు. దీనికి 18 శాతం జీఎస్టీ కలిపి రూ.కోటీ87లక్షల61వేల998 చెల్లించాలి. ఈ మొత్తం చెల్లించాకే అధికారులు పార్కింగ్ ఫీజు వసూలుకు ఆదేశాలిస్తారు. రెండో సంవత్సరం అప్పటి వరకు చెల్లించిన మొత్తానికి పదిశాతం పెంచి, 18 శాతం జీఎస్టీని కలిపి చెల్లించాలి. రెండో ఏడాది రూ.కోటీ74లక్షల89వేల998, 18 శాతం జీఎస్టీ రూ.31లక్షల48వేల199వేలు కలిపి మొత్తం రూ.2కోట్ల06లక్షల38వేల197 చెల్లించాలి. ఇక్కడే కాంట్రాక్టర్ అతి తెలివి ఉపయోగించారు.

షరతులు ఉల్లంఘించి..

టెండర్ నోటిఫికేషన్ విడుదల చేసే సమయంలో అందులో పాల్గొనే

మిగతా 6లో..

స్థలంతో పాటు ఆరు నెలలు ఉచితంగా..

పార్కింగ్ కాంట్రాక్టు రెండేళ్ల మొత్తంలో ఒక ఏడాది సొమ్మును దేవస్థానానికి చెల్లించిన కాంట్రాక్టర్ రెండో ఏడాది చెల్లించాల్సిన మొత్తానికి పంగనామాలు పెట్టి, ఉచితంగా కాలం గడిపేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఇందులో కాంట్రాక్టర్ వేసిన స్కెచ్‌ను అధికారులు అమలు చేస్తున్నారు. కాంట్రాక్టర్ దేవి రెండో ఏడాది రూ.2కోట్ల06లక్షల38వేల197 చెల్లించాలి. ఈ మొత్తాన్ని చెల్లించమని అధికారులు పలుమార్లు అడిగారు. ఒకసారి నోటీసు జారీ చేశారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. కొద్దినెలల క్రితం కాంట్రాక్టర్ అధికారుల వద్దకు వెళ్లి ఓ ప్రతిపాదన చేశారు. కొండచరియలు విరిగినప్పుడు ఘాట్‌రోడ్డును మూసివేశారని, కనకదుర్గానగర్‌లో అభివృద్ధి పనులు చేపట్టడం వల్ల పార్కింగ్ ప్రదేశం తగ్గిపోయిందని అధికారులకు విన్నవించారు. దీనివల్ల మొదటి ఏడాది బాగా నష్టపోయామని చెప్పుకొచ్చారు. కాబట్టి తనకు ఆరు నెలల ఉచిత అవకాశం ఇప్పించాలని విన్నవించుకున్నారు. ఈ విషయాన్ని అధికారులు ఆగమేఘాలపై దేవదాయ శాఖ కమిషనర్‌కు లేఖ రూపంలో తెలియజేశారు. వివిధ కారణాల రీత్యా ఘాట్‌రోడ్డును నాలుగు నెలలు మూసివేశామని, కాబట్టి కాంట్రాక్టర్‌కు ఆరు నెలలు ఉచితం ఇవ్వాలని ప్రతిపాదన పంపారు. ఇందుకు అధికారులే ఆమోదముద్ర వేయించారు. గత జూన్ ఒకటో తేదీ నుంచి నవంబరు 30 వరకు దేవస్థానానికి రూపాయి చెల్లించకుండా పార్కింగ్‌ను నిర్వహించుకోవచ్చని దుర్గగుడి అధికారులు సెప్టెంబరు 9న ఉత్తర్వులు ఇచ్చారు. కనకదుర్గానగర్‌లో అభివృద్ధి పనులు జరుగుతున్నందున సీతమ్మవారి పాదాల వద్ద ఉన్న వీఎంసీకి చెందిన ఖాళీ స్థలాన్ని కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఇక్కడ పార్కింగ్‌ను నిర్వహించుకునేలా వీఎంసీ అధికారులతో దుర్గగుడి అధికారులే మాట్లాడటం గమనార్హం. సరిగ్గా ఆరు నెలల ఉచిత గడువు ముగుస్తుందన్న సమయానికి కాంట్రాక్టర్ మరో ప్రతిపాదనను అధికారుల ముందు ఉంచారు. తనకు మరో రెండు నెలల ఉచిత గడువు కావాలని కోరారు. అప్పటికే ఆరు నెలలు ఉచితంగా ఇచ్చిన విషయం బయటపడటంతో రెండు నెలలు పొడిగించడానికి అధికారులు తటపటాయిస్తున్నారు. ఇక కాంట్రాక్టర్ కోర్టు మెట్లెక్కి.. గడువు ముగిసినా పార్కింగ్‌పై కాసులను వెనుకేసుకుంటున్నారు. అయినా దేవస్థానం అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కోర్టులో దీనిపై కనీసం కౌంటర్ కూడా దాఖలు చేయలేదు.

అర్ధరాత్రి అక్రమాలు



వరదలకు జారిపడిన జక్కంపూడి కొండచరియలు స్వాహా

- వైసీపీ హయాంలోని అక్రమార్కులే సూత్రధారులు
- అర్ధరాత్రి రహస్యంగా తరలింపు
- రియల్ వెంచర్లకు విక్రయం
- అడ్డుకున్న షాబాద గ్రామస్తులు
- రెవెన్యూ తనిఖీలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : బుడమేరు వరదల కారణంగా విరిగిపడిన జక్కంపూడి కొండచరియలను కూడా అక్రమార్కులు వదలట్లేదు. అనుమతులు లేకున్నా రాత్రికిరాత్రే గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తూ భారీగా సొమ్ము చేసుకుంటున్నారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎవరైతే అక్రమంగా గ్రావెల్ దందా సాగించారో వారే ఈ తంతు నిర్వహించారు. ఓపక్క క్వారీలపై ఆడిట్ పూర్తయ్యే వరకు అనుమతులు ఇవ్వొద్దని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేస్తుండగా, మరోపక్క అధికారికంగా అనుమతులు లేవని తెలిసి కూడా గ్రావెల్ మాఫియా బరి తెగిస్తోంది.

అక్రమార్కులకు కలిసొచ్చిన వరదలు

ఇటీవల బుడమేరుకు భారీగా వరద వచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో షాబాద పరిధిలో ఉండే జక్కంపూడి కొండ సర్వే నెంబర్ 88 ప్రాంతం ముంపునకు గురైంది. టిడ్కో ఇళ్ల కోసం కొండను తొలచటం వల్ల నాని పోయి ఉన్న కొండ కొంతమేర విరిగి పడింది. కొన్ని లక్షల క్యూబిక్ మీటర్ల గ్రావెల్ కలిగిన కొండ విరిగి కిందకు జారింది. రూ.లక్షలు ఖర్చుపెట్టి బ్లాస్టింగ్‌లు చేయకుండానే గ్రావెల్ కిందకు జారటంతో అక్రమార్కుల కన్ను దీనిపై పడింది. ఈ గ్రావెల్‌ను తన్నుకుపోవటానికి స్కెచ్ వేశారు. ఈ మట్టిని మూడో కంటికి తెలియకుండా తప్పుకోవటానికి పథకం వేశారు. ప్రభుత్వ శాఖలు పనిచేయని సెలవు రోజుల్లో,

మిగతా 6లో..

టెండర్ల రద్దు వివాదాస్పదం

- మొన్న డ్రెయినేజీ, నేడు ఇరిగేషన్ టెండర్ల రద్దు
- గుడివాడ డివిజన్‌లోని కాంట్రాక్టర్ల గుర్రు
- అనుయాయుల కోసం ఎమ్మెల్యేల హడావిడి

ఆంధ్రజ్యోతి-గుడివాడ : మొన్న డ్రెయినేజీ టెండర్ల రద్దు.. నేడు ఇరిగేషన్ టెండర్ల రద్దు.. గుడివాడ డివిజన్ పరిధిలో తమ అనుయాయులకు టెండర్లు కట్టబెట్టేందుకు జిల్లా ఎమ్మెల్యేలు తెగ ప్రయత్నిస్తున్నారు. టెక్నికల్, పరిపాలనా ప్రాతిపదికన టెండర్లను వాయిదా వేసినట్లు అధికారులు పైకి చెబుతున్నా.. జిల్లాలోని కొందరు రాజకీయ నాయకులు కూడబలుక్కుని రద్దు చేయించారని కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. కాదు కూడదు.. అంటున్న అధికారులను బదిలీ చేయిస్తామని ఎమ్మెల్యేలు బెదిరింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి. అలాగే, మరోసారి టెండర్ల జోలికి రాకుండా కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నట్టు సమాచారం. టెండరుదారుల్లో కొందరు ప్రస్తుతం పనులు చేస్తున్నారని, అలాంటి వారి బిల్లుల చెల్లింపులు ఆలస్యం చేసేలా అధికారులపై ఒత్తిడి తీసుకొస్తున్నారనే గుసగుసలు కూడా వినిపిస్తున్నాయి.

డ్రెయినేజీ టెండర్లు ఇలా..

గుడివాడ డివిజన్ పరిధిలోని నాలుగు సెక్షన్లలో రూ.5.74 కోట్లతో 29 పనులు చేపట్టేందుకు నవంబరు 11న టెండర్లు పిలిచారు. ఈనెల 4వ తేదీ సాయంత్రం అధికారులు హడావిడిగా కొన్ని టెండర్లు తెరిచారు. అయితే, 7వ తేదీ వాటిని

మిగతా 6లో..

ప్రతి ఇల్లూ సూర్య ఘర్ కావాలి

పీఏం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై సమీక్షలో కలెక్టర్ లక్ష్మీశ



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన (సౌర విద్యుత్) పథకం అమలుతో జిల్లాలోని ప్రతి ఇల్లూ సూర్య ఘర్ కావాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. ఆర్థిక చేయూతతో పాటు పర్యావరణ పరిరక్షణకు కీలకమైన ఈ పథకం ప్రయోజనాలను ప్రజలకు వివరించాలని సూచించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన పీఏం సూర్యఘర్ ముఫ్త్ బిజిలీ యోజనపై జిల్లాస్థాయి కమిటీ (డీఎల్‌సీ) సమావేశం జరిగింది. ఇందులో ఏపీసీపీడీసీఎల్, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో పాటు వివిధ ఏజెన్సీల ప్రతినిధులతో చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ ఏడాది ఫిబ్రవరి 13న ప్రధాని ప్రారంభించిన పీఏం సూర్యఘర్ ద్వారా ఇంటి పైకప్పుపై రాయితీతో, అతి తక్కువ ఖర్చుతో సోలార్ సిస్టమ్‌ను ఏర్పాటు చేసుకొని కరెంటు బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చని తెలిపారు. వికసిత్ భారత్ 2047, స్వర్ణాంధ్ర విజన్ 2047 లక్ష్యాల సాధనకు పునరుత్పాదక ఇంధన వనరులను సమర్థవంతంగా ఉపయోగించుకోవడం ప్రధానమన్నారు. ఈ నేపథ్యంలో పీఏం సూర్యఘర్ రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని సూచించారు. రూ.2 లక్షల విలువైన 3 కేడబ్ల్యూ సోలార్ ప్యానెల్‌ను రూ.78 వేల రాయితీతో ఇంటి పైకప్పుపై ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. ఈనెల 14 నుంచి 20 వరకు జాతీయ ఇంధన పరిరక్షణ వారోత్సవాల నేపథ్యంలో సూర్యఘర్‌పై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

ఐదు ఆదర్శ సౌర గ్రామాల గుర్తింపు

జిల్లాలో బూదవాడ (జగ్గయ్యపేట), వెల్వడం (మైలవరం), పరిటాల (కంచికచర్ల), కంభంపాడు (ఎ.కొండూరు), షేర్ మహ్మద్ పేట (జగ్గయ్యపేట) గ్రామాలను ఆదర్శ సౌర గ్రామాలుగా గుర్తించారు. దేశంలో సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఏం సూర్యఘర్ పథకంలో భాగంగా ఐదు వేలకు పైబడి జనాభా ఉన్న గ్రామాలను గుర్తించి, ఆదర్శ సౌర గ్రామాల కాంపొనెంట్‌ను అమలు చేస్తున్నారు. ఈ గ్రామాల్లో పునరుత్పాదక ఇంధన వినియోగంలో పోటీతత్వాన్ని పెంచి, త్వరితగతిన 100 శాతం లక్ష్యాన్ని చేరుకొన్న గ్రామాలకు రూ.కోటి కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయం అందుతుంది. విద్యుత్ శాఖ ఎస్ఈ ఎ.మురళీ మోహన్, నేడల్ అధికారి ఎం.భాస్కర్, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాస రావు, డీపీఓ పి.లావణ్య కుమారి, ఎన్ఆర్ఈడీసీఏపీ కో ఆర్డినేటర్ మురళి పాల్గొన్నారు.

జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖలో ఖాళీల భర్తీ

ఐసీడీఎస్ పీడీ జి.ఉమాదేవి

కృష్ణలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వన్ స్టాప్ సెంటర్ నందు ఖాళీగా ఉన్న సెంటర్ అడ్మినిస్ట్రేషన్ పోస్టు, సోషల్ కౌన్సిలర్ పోస్టులను భర్తీ చేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారిణి జి.ఉమాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పై పోస్టులను కాంట్రాక్టు లేదా అవుట్‌సోర్సింగ్ ప్రాతిపదికన భర్తీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. 18 సంవత్సరాలు నిండి 42 సంవత్సరాలలోపు వయస్సు కలిగిన స్థానిక మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూసీ వర్గాలకు చెందిన మహిళలకు ఐదు సంవత్సరాలు, దివ్యాంగులకు 10 సంవత్సరాల గరిష్ట వయస్సు సడలింపు ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు మంగళవారం నుంచి 18వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

జిల్లా విజిలెన్స్,మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు చర్యలు

- జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ కేసుల పరిశీలన, విచారణ నిమిత్తం
- ఐదుగురు సభ్యులు గల కమిటీ పరిమితి రెండేళ్లు
- కమిటీ సభ్యుల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ లీగల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా పరిధిలోని షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల అత్యాచార కేసుల పరిశీలన, విచారణ చర్యల నిమిత్తం జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ ఏర్పాటుకు చర్యలు తీసుకొంటున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఈ కమిటీలో షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగలకు చెందిన ఐదుగురిని సభ్యులుగా నియమించనున్నట్లు పేర్కొన్నారు. కమిటీ సభ్యుల కాలపరిమితి రెండు సంవత్సరాలు మాత్రమే ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాలు జిల్లా ఎస్సీ వెల్ఫేర్ అండ్ ఎంపవర్‌మెంట్ ఆఫీసర్ వారి కార్యాలయం, సాంఘిక సంక్షేమ శాఖ, మారుతీ నగర్, పంటకాలువ రోడ్డు, ఎన్టీఆర్ జిల్లా, విజయవాడ నందు తీసుకోవాలని సూచించారు. పూర్తిచేసిన దరఖాస్తులను తగిన ధృవపత్రాలతో ఈ నెల 14వ తేదీ లోగా పైన తెలిపిన కార్యాలయంలో అందజేయాలని కోరారు. వివరాలకు 70756 24856కు ఫోన్ నంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

'పీఏం పోషణ'కు రూ.1.63 కోట్లు విడుదల

పార్లమెంట్‌లో ఎంపీల ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి సమాధానం

వన్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గత అయిదు సంవత్సరాల్లో ప్రధాన మంత్రి పోషణ పథకం కింద రాష్ట్రానికి రూ.1.63 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి జయంత్ చౌదరి చెప్పారు. పార్లమెంటులో ఎంపీలు కేశినేని శివనాథ్, బి.కె.పార్థసారథి, దగ్గుమళ్ల ప్రసాదరావు వేసిన ప్రశ్నలకు కేంద్ర ప్రభుత్వం ఈ మేరకు బదులిచ్చింది. గత అయిదు సంవత్సరాల్లో ప్రధాన మంత్రి పోషణ శక్తి నిర్మాణ పథకం కింద మొత్తంగా రూ.1.63 కోట్లు విడుదల చేసినట్లు జయంత్ చౌదరి వెల్లడించారు. 2023-2024కు రూ.25,342.88 మంజూరైనట్లు పేర్కొన్నారు. కాగా, ఈ పథకం కింద రాష్ట్రంలో మొత్తం 2,24,751 పాఠశాలలు నమోదు అయ్యాయని, 2023-2024లో 44,150 పాఠశాలలు నమోదైనట్లు తెలిపారు. హిందూపురం నియోజకవర్గంలో 2,098, చిత్తూరు నియోజకవర్గంలో 2,514 పాఠశాలలు ఉన్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ప్రభుత్వ అనుబంధ ప్రీ ప్రైమరీ విద్యార్థులకు పాఠశాలల పనిదినాలలో భోజనం అందిస్తున్నట్లు తెలిపారు. గత అయిదేళ్లలో ఈ పథకం కింద 1,55,90,312 మంది విద్యార్థులు లబ్ధి పొందారని చెప్పారు. 2023-2024లో 520 పర్యాయాలు సామాజిక తనిఖీ నిర్వహించినట్లు తెలిపారు.

ఎంత 'ఘాటు'ప్రేమో..

(5వ పేజీ తరువాయి)

గుత్తేదారులకు దేవస్థానం కొన్ని షరతులు విధిస్తుంది. దేవస్థానంలోని అన్ని విభాగాల్లో టెండర్లు ఆహ్వానించేటప్పుడు ఈ ప్రక్రియ ఉంటుంది. ఆ విధంగా పార్కింగ్‌కు సంబంధించిన టెండర్లలో పాల్గొనే గుత్తేదారులకు 34 షరతులు విధించారు. ఇందులో 13వ షరతు చాలా కీలకమైంది. లైసెన్స్ కాలంలో ప్రకృతి వైపరీత్యాలు, సమ్మెలు, బంద్‌లు వంటి కారణాల వల్ల ఘాట్‌రోడ్డును మూసివేస్తే వాటితో దేవస్థానానికి ఎలాంటి సంబంధం ఉండదని ప్రస్తావించారు. దీనికి కాంట్రాక్టర్ బాధ్యత వహించి, ఆ మొత్తాన్ని చెల్లించాలని స్పష్టంగా పేర్కొన్నారు. దీనిప్రకారం కాంట్రాక్టర్ మొత్తం సొమ్మును చెల్లించాలి. ఈ షరతు ప్రకారం కాంట్రాక్టర్‌కు ఉచితంగా పార్కింగ్‌ను నిర్వహించుకునే అవకాశం ఇవ్వడం ద్వారా అధికారులు రూపొందించుకున్న నిబంధనలను వాళ్లే ఉల్లంఘించారు. నిబంధనల ప్రకారం ఘాట్‌రోడ్డుపైకి కార్లు, ద్విచక్రవాహనాలు, మినీ టూరిస్టు బస్సులనే అనుమతించి టోల్ వసూలు చేయాలి. ఆటోలకు ప్రవేశాన్ని నిషేధించారు. అయినా కాంట్రాక్టర్ సంస్థ ఆటోలను ఘాట్‌రోడ్డులోకి అనుమతించి టోల్ వసూలు చేస్తున్నా అధికారులకు కనీసం కనిపించట్లేదు.

గుడివాడ నియోజకవర్గంలో బుడమేరు గట్టు పటిష్ఠం చేసేందుకు చేపట్టిన పనుల్లో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. ఇటీవల వచ్చిన వరదలకు గట్టుకుంగిపోయింది. విద్యుత్ స్తంభాలు సైతం పక్కకు ఒరిగిపోయాయి. భారీ వర్షాలు, వరదలు వస్తే గట్టు తెగిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జారిపోయిన బుడమేరు గట్టు

బుడమేరు గట్టుకు ప్రమాదం!

వైసీపీ పాలనలో రూ.30 లక్షలతో పటిష్టత పనులు

- నిర్లక్ష్యంగా పనులు నిర్వహించిన కాంట్రాక్టర్!
- జారిపోతున్న మట్టి.. ఒరిగిపోతున్న స్తంభాలు
- ఆందోళనలో రైతులు



అరిపిరాల సప్తా పక్కన బుడమేరు గట్టు దుస్థితి

ఆంధ్రజ్యోతి-గుడివాడ: గత వైసీపీ ప్రభుత్వంలో బుడమేరు గట్టు పటిష్టతకు 2022-2023 సంవత్సరంలో రూ.30 లక్షలతో పనులు చేపట్టారు. మాజీ మంత్రి కొడాలి నాని ముఖ్య అనుచరుడు పాలడుగు రాంప్రసాద్‌కు అత్యంత సన్నిహితుడైన వ్యక్తికి ఈ పనుల కాంట్రాక్టును అప్పగించారు. అప్పట్లో గట్టు పటిష్టతలో నాణ్యత లోపించిందని, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని టీడీపీ నేత, వెంకట రాఘవపురం సర్పంచ్ కాకరాల సురేష్ ఫిర్యాదు చేశారు. అప్పటి టీడీపీ ఇన్‌చార్జి రావి వెంకటేశ్వరరావు సైతం డ్రైనేజీ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది. ఆనాడు మాజీ మంత్రి కొడాలి నాని చెప్పిందే వేదంగా అధికారులు నడుచుకున్నారు. టీడీపీ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని కొట్టిపారేసారు.

వరదలతో మరింత బలహీనం

మొన్నటి బుడమేరు వరదలకు నందివాడ మండలం అరిపిరాల సప్తా సమీపంలో గట్టు బుడమేరులోకి జారి పోయింది. విద్యుత్ స్తంభాలు సైతం ఒరిగిపోయాయి. మరో పర్యాయం బుడమేరుకు వరదలు వస్తే గట్టు తెగిపోయి ఊళ్లను ముంచేసే ప్రమాదం నెలకొని ఉందని స్థానిక రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గట్టును పటిష్ఠం చేయాలని కోరుతున్నారు.

బుడమేరు మట్టిని అమ్మేసుకుని

నందివాడ మండలం చేదుర్తిపాడు, గన్నవరం మండలం కొయ్య గూరపాడు గ్రామాల మధ్య బుడ మేరులో యథేచ్ఛగా మట్టిని తవ్వేసుకుని అమ్మేసుకున్నారు. అమ్ముకున్న మట్టి విలువ సుమారు రూ.1.50 కోట్లు ఉంటుందని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బుడమేరు గట్టు పటిష్టత పనులు చేపట్టన కాంట్రాక్టర్ గత వైసీపీ హయాంలో మాజీ మంత్రి కొడాలి నాని చెప్పిందే వేదంగా నడుచుకున్నారు. నేడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ముగ్గురు కూటమి ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్లు టీడీపీ వర్గాల్లో వినికిడి. వీరిని ప్రసన్నం చేసుకుని కాంట్రాక్టులు చేపట్టాలని ప్లాన్ చేసుకున్నట్లు సమాచారం.

సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపండి

మీకోసం కార్యక్రమంలో కలెక్టర్ బాలాజీ

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల స్వీకరణ



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ, జేసీ గీతాంజలిశర్మ

మచిలీపట్నం, డిసెంబరు9(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక(మీకోసం)లో వచ్చే అర్జీలను పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో సోమవారం జేసీ గీతాంజలిశర్మ, ఏఎస్పీ వీవీ నాయుడు, ఇన్‌చార్జి డీఆర్వో శ్రీదేవి, ఆర్డీవో కె.స్వాతి తదితరులతో కలసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉయ్యూరు మండలం రొయ్యూరు గ్రామానికి చెందిన రైతు లుక్కా ఓంకారం తన కుమారుడికి, తనకు చెందిన 477 బస్తాల ధాన్యం మిల్లుకు వెళ్లకుండా పొలం వద్దనే ఉండిపోయాయని, ధాన్యం విక్రయించేందుకు వెళితే అధికారులు పట్టించుకోవడం లేదని, వాతావరణంలో మార్పులతో ఆందోళన చెందుతున్నామని, ధాన్యం కొనుగోలు చే సేలా చర్యలు తీసుకోవాలని అర్జీ అందజేశారు. పెడన పురపాలక సంఘం 10వ వార్డుకు చెందిన మల్లా శాంతి తన కుమారుడు పుట్టుకతోనే అంధుడని, ప్రస్తుతం రూ.6వేలు పింఛను వస్తోందని, నెలకు రూ.15వేల పింఛను ఇప్పించాలని కోరుతూ అర్జీ ఇచ్చారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కన్నమనాయుడు పాల్గొన్నారు.

పనిచేసే ప్రదేశాల్లో మహిళలకు రక్షణ

పనిచేసే ప్రదేశాలలో మహిళలకు రక్షణ కల్పించేందుకు లైంగిక వేధింపుల నివారణ, నిషేధం, పరిహారం చట్టం-2013 అమలులోకి వచ్చిందని కలెక్టర్ బాలాజీ తెలిపారు. ఈ చట్టంపై అవగాహన కల్పించేలా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రూపొందించి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన బోర్డును కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు. కార్యాలయాలు, కర్మాగారాలు, స్వయం ఉపాధి ప్రదేశాలలో పది మంది కంటే అధికంగా మహిళలు ఉంటే అక్కడ ఈ చట్టం అమలు చేసేందుకు ప్రత్యేక అంతర్గత కమిటీలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. మహిళలు లైంగిక వేధింపులకు గురైన ఘటనలపై విచారణ చేసి, ఈ కమిటీలు నివేదికలు సమర్పిస్తాయని చెప్పారు. ఈ నివేదికల ఆధారంగా బాధ్యులపై చట్టప్రకారం శిక్షలు, జరిమానాలు అమలు చేస్తారని తెలిపారు. ఐసీడీఎస్ పీడీ సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో సమస్యలకు పరిష్కారం

కృష్ణలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలను సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో లక్ష్మీశ, జేసీ నిధి మీనా, డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతి, డీఆర్‌డీఏ పీడీ కె.శ్రీనివాస రావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రతి అర్జీని క్షుణంగా పరిశీలించి ఎస్ఓపీ ప్రకారం నాణ్యతతో పరిష్కరించాలని చెప్పారు. ఇందుకు జిల్లాస్థాయి అధికారులు, క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. అర్జీల న్నింటిని నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని వివరించారు.



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

ఇక మామిడి పంటలకు బీమా సౌకర్యం

ఎన్టీఆర్ జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్

కృష్ణలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ జిల్లాలో మామిడి పంటలకు ప్రభుత్వం వాతావరణ ఆధారిత బీమా పథకంలో అవకాశం కల్పించిందని ఎన్టీఆర్ జిల్లా ఉద్యాన అధికారి పి.బాలాజీ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రీమియం, గడువు, బీమా వర్తింపు అంశాలు వెల్లడించారు. అగ్రికల్చర్ ఇన్సూరెన్సు కంపెనీ ఆఫ్ ఇండియా లిమిటెడ్ అనే కేంద్ర ప్రభుత్వ సంస్థ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల సహకారంతో బీమా చెల్లింపునకు ఒప్పందం చేసుకొందని తెలిపారు. రైతులు బీమా ప్రీమియం ఎకరాకు రూ.2,050 చొప్పున ఈ నెల 15 లోగా చెల్లించాలని పేర్కొన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో దెబ్బతింటే ఎకరాకు రూ.41 వేలు వర్తిస్తుందని తెలిపారు. ఈ బీమా పథకాన్ని ఈ సంవత్సరం డిసెంబరు 15 నుంచి వచ్చే ఏడాది మే 31 వరకు ప్రకటించినట్లు పేర్కొన్నారు. ఈ మధ్య కాలంలో అధిక వర్షం, గాలిలో తేమ శాతం, వాతావరణం వ్యత్యాసం, అధిక గాలులు తదితర కారణాలతో నష్టం వాటిల్లితే, ప్రభుత్వ నిబంధనల మేరకు అంచనా వేసి బీమా వర్తింపు చేస్తారని తెలిపారు. ప్రీమియం చెల్లించే రైతులు తమ బ్యాంకు అకౌంట్ జిరాక్సు, ఆధార్ కార్డు జిరాక్స్, భూమి పాస్ బుక్ జిరాక్సు, పంట నష్టం వేసినట్లు ధృవీకరణ పత్రాలను వెంట తీసుకెళ్లాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. ఈ పథకం ఐదేళ్ల వయస్సు ఉన్న చెట్లకే బీమా వర్తిస్తుందని, రైతులు మీసేవ లేదా దగ్గరలో ఉన్న బ్యాంకు ద్వారా లేక నేరుగా పీఎంఎఫ్‌బీవై పోర్టల్‌లో మొబైల్ ద్వారా ప్రీమి యం రూ.2,050 చెల్లించవచ్చునని తెలిపారు. ఇతర వివరాలకు మీ దగ్గరలో ఉన్న రైతు సేవా కేంద్రాల్లో గానీ, ఉద్యాన అధికారులను గానీ సంప్రదించాలని కోరారు.

'మార్కెట్ యార్డు' శిథిలం



మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డు



శిథిలమైన పెద్ద గిడ్డంగి

- లక్ష్యానికి దూరంగా మచిలీపట్నం మార్కెట్ యార్డు
- దెబ్బతిన్న గిడ్డంగులు.. నోచుకోని మరమ్మతులు
- ఆదాయం మాత్రం రూ.3.50 కోట్లపైనే..
- అయినా రైతులకు అందని కనీస సేవలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన మచిలీపట్నంలోని వ్యవసాయ మార్కెట్ యార్డు లక్ష్యాలకు దూరంగా ఉంది. రైతుల ఆశలకు మార్కెట్ యార్డు రాను రాను దూరమైపోతోంది. రైతుల సంక్షేమానికి ఆశించిన విధంగా కార్యక్రమాలు నిర్వహించడం లేదు. గిడ్డంగులు శిథిలమవుతున్నాయి. మార్కెట్ యార్డు పరిధిలో 12 గిడ్డంగులు ఉన్నాయి. వాటిలో మూడు గిడ్డంగులు మరమ్మతులు లేకుండా ఉన్నాయి. 30 ఏళ్ల కిందట నిర్మించిన గిడ్డంగులు మరమ్మతులు లేకపోవడం వల్ల మూడు గిడ్డంగులకు తలుపులు, దర్వాజాలు లేకుండా పోయాయి. పైకప్పులు శిథిలమై పాక్షికంగా కూలిపోతున్నాయి. మార్కెట్ యార్డు నిధులతో రైతులకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం లేదు. రైతులు పొలాలకు వెళ్లే డొంక రోడ్ల నిర్మాణాల ఊసే లేదు. రైతులు నిల్వ చేసిన ధాన్యంపై రుణ సౌకర్యం కల్పించాల్సి ఉంది.

రుణ సౌకర్యం ఊసే లేదు

మార్కెట్ యార్డు పరిధిలో ఇంటిగ్రేటెడ్ ల్యాబ్, వ్యవసాయ శాఖ కార్యాలయాలు, 12 గిడ్డంగులు ఉన్నాయి. వాటిల్లో 2 గిడ్డంగులు సివిల్ సప్లైస్‌కు ఇచ్చారు. మరో రెండు గిడ్డంగులు హౌసింగ్ శాఖకు ఇచ్చారు. ఒక గిడ్డంగి ఆచార్య నాగార్జున యూనివర్సిటీ వారి విత్తనాలకు అవసరమైన ధాన్యం నిల్వలో ఉంచారు. మరొక గిడ్డంగిలో విత్తనశుద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయి. వృద్ధులు, దివ్యాంగుల శాఖ పరికరాలను ఒక గిడ్డంగిలో ఉంచారు. రెండు గిడ్డంగుల్లో ఈవీఎంలు ఉంచారు. మూడు గిడ్డంగులు శిథిలమై మరమ్మతులకు నోచుకోలేకుండా మూలనపడ్డాయి. రైతులు తమ ధాన్యాన్ని ఈ గిడ్డంగుల్లో గిట్టుబాటు ధర వచ్చే వరకు నిల్వ ఉంచుకుని అమ్మేవారు. అలా రైతులు నిల్వ ఉంచిన ధాన్యంపై మార్కెట్ యార్డు రుణ సౌకర్యం కల్పించేవారు. ఇప్పుడా ప్రక్రియ జరగడం లేదు.

మార్కెట్ యార్డు ఆదాయం రూ.3.50 కోట్లు

వ్యవసాయ మార్కెట్ యార్డుకు చెక్‌పోస్టులు, ట్రేడర్స్ ద్వారా ఆదాయం సమకూరుతుంది. పెడన, సుల్తానగరం, చల్లపల్లి రోడ్డులో మూడు చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈ చెక్ పోస్టుల వద్ద పంటలను వాహనాలపై ఎగుమతి చేసే సమయంలో సెస్ విధిస్తారు. ఈ సెస్ వల్ల దాదాపు రూ. 2 కోట్ల ఆదాయం సమకూరుతుంది. ట్రేడర్స్ వల్ల మరో రూ. కోటి ఆదాయం వస్తుంది. మచిలీపట్నం మార్కెట్ యార్డు పరిధిలో 78 మంది ట్రేడర్స్ ఉన్నారు. రైసు మిల్లులు, ఇతర సేల్స్ పర్చేజ్ ఏజెంట్ల నుంచి ఆదాయం సమకూరుతుంది. సివిల్ సప్లైస్ సరఫరా చేసే బియ్యంపై కొంత ఆదాయం సమకూరుతుంది. ఇలా రూ.3.50 కోట్ల వరకు వచ్చే ఆదాయంపై బడ్జెట్‌ను రూపొందిస్తారు. ఈ బడ్జెట్‌లో డొంక రోడ్లు, శిథిలమైన భవనాల మరమ్మతులకు నిధులు కేటాయించాల్సి ఉంది. మార్కెట్ యార్డు పరిధిలో ఉద్యోగులందరికీ సెస్‌లపై వచ్చే ఆదాయంలోనే జీతభత్యాలు చెల్లిస్తున్నారు.

సమస్యలు తెలుసుకునేవారే కరువు



మార్కెట్ యార్డుకు చైర్మన్ లేరు. రైతుల సమస్యలను తెలుసుకునే వారే కరువయ్యారు. రైతుల కష్టసుఖాలు తెలిసిన చైర్మన్‌ను నియమిస్తే కొన్ని సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. డొంక రోడ్ల నిర్మాణం చేపట్టాలని చాలా కాలం నుంచి అడుగుతున్నాం. అధికారులు పట్టించుకోవడం లేదు. గిడ్డంగుల మరమ్మతులు చేస్తే మార్కెట్ యార్డుకు ఆదాయం లభిస్తుంది. **- రామయ్య, రైతు**

మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేశాం



మూడు గిడ్డంగులు శిథిలమయ్యాయి. వాటిల్లో రెండు మరీ దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతులకు ఎస్టిమేట్లు వేయించాం. రూ.30 లక్షలు మంజూరు చేస్తే గిడ్డంగులు బాగుపడతాయి. ఇందుకు ఉన్నతాధికారులకు తెలియజేశాం. రైతులు ధాన్యం నిల్వ పెట్టుకునేందుకు కావలసిన వనరులు ఉన్నాయి. మార్కెట్ యార్డు పరిధిలోని వ్యాపారుల నుంచి అందవలసిన సెస్ బకాయిలను రాబడుతున్నాం. ఆదాయం అధికంగా వస్తే రైతులు ఆశించిన విధంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టగలం. రోడ్ల నిర్మాణాలు, గిడ్డంగుల మరమ్మతులు చేపట్టగలుగుతాం. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులతో చర్చిస్తున్నాం. **- టి. మంజుల, వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి**

వైసీపీ చిత్తం

(5వ పేజీ తరువాయి)

నిర్మించే భవనాలకు సంబంధించిన స్థలంలో 10 శాతం వాటాను.. కార్పొరేషన్‌కు రిజిస్ట్రేషన్ జరిగే సమయంలో ఈయనకు ముట్టజెప్పాలి. అంత ఇస్తేకానీ, రిజిస్ట్రార్ కార్యాలయానికి ఈ ఉద్యోగి కాలు కదపరనే ప్రచారం జరుగుతోంది. టిడ్కో ఇళ్లకు సంబంధించిన వ్యవహారాల్లోనూ ఈ ఉద్యోగి ఇదే పద్ధతిని పాటిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ప్రతి పనికీ ముక్కుపిండి మరీ వసూళ్లకు పాల్పడుతున్నా పట్టించుకునేవారే కరువయ్యారు. కార్పొరే షన్ కార్యాలయంలో ముగ్గురు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు ఉండగా, వారిలో ఇద్దరిని ఇటీవల అతికష్టంమీద మార్పు చేశారు. ఒక ఆర్ఐను మాత్రం అదే సీటులో ఉంచారు. ఈ ఉద్యోగిని మార్చకుండా ఉండటానికి తెరవెనుక ఏదో మతలబు జరిగిందనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

పారిశుధ్య విభాగాన్ని పట్టించుకునేదెవరు..?

నగరంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. అక్టోబరు 2న మచిలీపట్నంలో సీఎం చంద్రబాబు పర్యటించాక పారిశుధ్యాన్ని మెరుగుపరుస్తామంటూ.. అధికారులు 10 రోజుల పాటు హడావిడి చేశారు. 50 డివిజన్లలో ప్రతి 10 డివిజన్లకు ఒక జిల్లాస్థాయి అధికారి చొప్పున ఐదుగురిని ప్రత్యేక అధికారులుగా నియమించారు. కొద్దిరోజుల పాటు డివిజన్లలో తిరిగిన వీరు.. ఆ తర్వాత కనిపించడం మానేశారు. గతంలో చెత్తను సేకరించే మూడు వాహనాలు మాయమైపోయినా.. ఎక్కడున్నాయో ఇంతవరకు ఆచూకీ లేదు. చెత్త సేకరణకు ప్రత్యేక వాహనాలను క్లాప్ ద్వారా ఏర్పాటు చేయగా, వీటిలో 12 వాహనాలు మరమ్మతులకు గురై మూలకు చేరాయి. వీటికి మరమ్మతులు చేసేందుకు కనీస చర్యలు తీసుకోవట్లేదు. కార్పొరేషన్‌లో మేస్త్రీలుగా పనిచేసే ఐదుగురికి ఇటీవల హెల్త్ అసిస్టెంట్లుగా పదోన్నతులు ఇచ్చారు. వీరికి సరైన విద్యార్హతలు లేకున్నా పదోన్నతి ఇవ్వడం గమనించదగ్గ అంశం. వీరు ముందుస్తుగా ఆరు నెలల పాటు శిక్షణ తీసుకోవాలి. కానీ, అదేం జరక్కుండానే హెల్త్ అసిస్టెంట్లుగా పదోన్నతి కల్పించారు.

అర్ధరాత్రి అక్రమాలు

(5వ పేజీ తరువాయి)

అర్ధరాత్రిపూట ఈ గ్రావెల్‌ను తరలించేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. గుట్టుచప్పుడు కాకుండా నెల రోజులుగా ఈ తంతు సాగిస్తున్నారు. ఇక్కడి మట్టి అంబాపురంలోని శ్రీసిటీ వెంచర్‌కు తరలిపోతోంది. అలాగే, రియల్ వెంచర్లకు, ఇతర ప్రాంతాలకు భారీగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కిందటి వైసీపీ ప్రభుత్వ హయాంలోని మాఫియానే ఇందులోనూ ప్రధాన పాత్ర పోషిస్తోంది. ఈ అడ్డగోలు వ్యవహారాన్ని షాబాద గ్రామస్తులు అడుకున్నారు. ఆ తర్వాత రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగటంతో ఈ అక్రమం వెలుగుచూసింది. అక్రమంగా క్వారీయింగ్ జరుపుతున్న ప్రాంతంలో రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి ఒక ఎక్స్‌కవేటర్, లారీని స్వాధీనం చేసుకున్నారు.

టెండర్ల రద్దు వివాదాస్పదం

(5వ పేజీ తరువాయి)

రద్దు చేస్తున్నట్లు డ్రెయినేజీ అధికారులు ప్రకటించారు. టెండరుదారులకు మెయిల్ ద్వారా సందేశాలు పంపారు.

ఇరిగేషన్ టెండర్లు అలా..

డ్రెయినేజీ టెండర్లు రద్దు చేసిన రెండు రోజులకు ఇరిగేషన్ టెండర్లు కూడా రద్దు చేశారు. ఇరిగేషన్ ఈఈ పరిధిలో రూ.3.84 కోట్లతో 26 పనులు చేపట్టేందుకు నవంబరు 11న టెండర్లు పిలిచారు. డిసెంబరు 4న కొన్ని టెండర్లు, 7న మరికొన్ని తెరిచారు. ఇక సోమవారం ఆ టెండర్లన్నింటినీ ఇరిగేషన్ అధికారులు రద్దు చేశారు. పరిపాలన ప్రాతిపదికన, టెక్నికల్ సమస్య కారణంగా వాయిదా వేస్తున్నట్లు ఇరిగేషన్ ఈఈ కొడాలి బాబు ప్రకటించారు.

మంత్రి నిమ్మలకు తెలియకుండా..

టెండర్ల రద్దు వ్యవహారం జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి వెళ్లకుండా జాగ్రత్త పడుతున్నారు. పరిపాలన ప్రాతిపదికన వాయిదా వేసినట్లు చూపి మంత్రి నిమ్మలను ఏమార్చే ప్రయత్నాలు చేస్తున్నట్లు కార్యాలయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. రాజకీయ నాయకుల ఒత్తిడితో డ్రెయినేజీ, ఇరిగేషన్ అధికారులు ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటున్నారని కాంట్రాక్టర్లు మండిపడుతున్నారు. అధికారుల నిర్ణయానికి వ్యతిరేకంగా కోర్టు మెట్లెక్కేందుకు సిద్ధమవుతున్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.625



కాలినడకన శ్రీశైల క్షేత్ర దర్శనం

విజయవాడ రూరల్ : విజయవాడ రూరల్ నున్న గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త మల్లెల జమలయ్య కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే కాలినడకన శ్రీశైలం క్షేత్రానికి వస్తానని మొక్కుకున్నాడు. కూటమి ప్రభుత్వం విజయంతో సోమవారం గ్రామ నేతలతో కలిసి బొడపాడు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, కోటగట్టు సెంటర్ వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించి శ్రీశైలానికి కాలినడక ప్రారంభించారు.

స్కిల్ డెవలప్‌మెంట్‌పై వర్క్‌షాప్

ఉయ్యూరు : నైపుణ్యత పెంపొందించుకోవడం ద్వారా ఉన్నత స్థాయిని అందిపుచ్చుకోవచ్చని సైకాలజిస్ట్ అండ్ న్యూరో మెంటర్ డాక్టర్ జోశ్యుల పూజిత విద్యార్థులకు సూచించారు. శ్రీజ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం విద్యార్థులకు డిజిటల్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు.

భూ సమస్యలకు శాశ్వత పరిష్కారమే

రెవెన్యూ సదస్సుల లక్ష్యం

గ్రామ సభలకు విశేష స్పందన

ఉంగుటూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రీ సర్వేల పేరుతో గత ప్రభుత్వం రికార్డుల్లో చేసిన సవరణలవల్ల తలెత్తిన భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపి ప్రజల ఆస్తులకు భద్రత కల్పించడమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఆరుమళ్ల వెంకటకృష్ణారెడ్డి అన్నారు. తేలప్రోలులో సర్పంచ్ లాం దిబోరా ఆధ్వర్యంలో సోమవారం రెవెన్యూ సదస్సు జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణారెడ్డి మాట్లాడుతూ, రెవెన్యూ సదస్సులద్వారా వైసీపీ భూ బకాసురుల ఆక్రమణల చెరనుంచి ప్రభుత్వ, ప్రైవేటు ఆస్తులకు విముక్తి కల్పించేందుకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం విశేష కృషిచేస్తోందన్నారు. రెవెన్యూ సదస్సుకు ప్రజలనుంచి విశేష స్పందన లభించిందని, కుల, ఆదాయ, నివాసధ్రువీకరణ పత్రాలతోపాటు, పాస్‌బుక్స్‌లో మార్పుచేర్పులు, తప్పొప్పుల సవరణలపై ప్రజల నుంచి 50 అర్జీలు స్వీకరించామని తహసీల్దార్ విమల కుమారి తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే(డీఐఎస్)నరసింహమూర్తి, మండల ఎండోమెంట్ ఆఫీసర్ ఈవీ ప్రసాదరావు, ఆర్‌ఐ. బి.సూర్యకాంతి, వీఆర్వో రామారావు, పంచాయతీకార్యదర్శి ఎన్. రాజేంద్రవరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సమస్యలపై అర్జీలు సమర్పిస్తున్న సీపీఎం నేతలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : భూ వివాదాలు, సమస్యల ఫిర్యాదులను పరిష్కరించేందుకు గ్రామస్థాయిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించడం జరుగుతున్నదని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. దంటగుంట్ల సర్పంచ్ యజ్జవరపు వెంకట రంగారావు అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సదస్సులో ఆయన పాల్గొన్నారు. రెవెన్యూశాఖలో ఆర్వోఆర్, అడంగల్, తదితర విషయాలపై సమస్యలను సత్వరం పరిష్కరించేలా చర్యలు చేపట్టామని, ఇంకా ఏవిధమైన సమస్యలున్నా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. దంటగుంట్లలో 6 సమస్యలు రాగా అందులో సర్వే వివరాలపై 3, అడంగల్ సవరణకు 3 వచ్చినట్లు వీఆర్‌వో మేరీ వివరించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ ఫణికుమార్, ఉపసర్పంచ్ రవి, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



దంటగుంట్లలో నిర్వహించిన రెవెన్యూసదస్సు

గన్నవరం : తెంపల్లిలో సోమవారం రెవెన్యూ గ్రామ సభను నిర్వహించారు. తహసీల్దారు కేవీ శివయ్య రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. అడంగల్ కరక్షన్ కోసం 3, ఎఫ్‌లైన్ కోసం 10, పట్టాదారు పాస్ పుస్తకాలకు 13 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. వీఆర్వోలు గోపాలరావు, మురళీ, రమ్య పాల్గొన్నారు.

కంకిపాడు: రెవెన్యూ సమస్యల పరిష్కరించేందుకు నిర్వహిస్తున్న గ్రామ సభలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని తహసీల్దార్ భవన్నారాయణ అన్నారు.



ప్రజల సమస్యలు అడిగి తెలుసుకుంటున్న తహసీల్దార్ భవన్నారాయణ

మంతెన గ్రామంలో సోమవారం నిర్వహించిన రెవెన్యూ గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ, సర్వే నంబర్లకు సంబంధించి సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



కింద పడ్డ బారికేడ్ల గడ్డర్లు, ప్రమాదానికి కారణమైన ట్రావెల్స్ బస్సు(కింద)

వంతెన బారికేడ్లను ఢీకొట్టిన ట్రావెల్స్ బస్సు!

- ధ్వంసమైన గడ్డర్లు, మోటారు సైకిల్
- రెండ్రోజులుగా రాకపోకలకు అంతరాయం



పెనమలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ప్రైవేటు ట్రావెల్స్ మినీబస్సు వంటకాల్వ రోడ్డులోని వీఆర్ సిద్ధార్థ కళాశాల పైవంతెన బారికేడ్లను ఢీకొనడంతో రెండు గడ్డర్లు ఊడి రోడ్డుపై పడ్డాయి. అదే సమయంలో అక్కడ పార్కు చేసి ఉన్న మోటారు సైకిల్ ధ్వంసమైంది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అధిక బరువున్న గడ్డర్లను తొలిగించకపోవడంతో దారికి అడ్డంగా ఉండి వంతెనపై రాకపోకలు నిలిచిపోయాయి. స్థానిక పోలీసులు స్పందించి వంతెనపై రాకపోకలను నిలిపివేశారు. భారీ, అతి భారీ వాహనాలకు వంతెనపై ప్రవేశం లేదని ముందస్తుగా తెలపకపోవడం, సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుందని స్థానికులు ఆరోపిస్తున్నారు.



పోరంకిలో రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

దశలవారీగా మునిసిపాలిటీ అభివృద్ధి : బోడె ప్రసాద్

పెనమలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : తాడిగడప మునిసిపాలిటీని దశలవారీగా అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. సోమవారం పోరంకి పీవీఎస్‌ఆర్ స్కూల్ రోడ్డులో నలభై లక్షల సాధారణ నిధులతో రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొద్ది మాసాల్లోనే నియోజకవర్గ వ్యాప్తంగా రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలు చేపట్టామని చెప్పారు.



హనుమాన్‌నగర్‌లో రోడ్డు పనులకు భూమిపూజ చేస్తున్న కూటమి నేతలు

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పల్లెపండగ.. ప్రగతికి అండగ.. కార్యక్రమం ద్వారా గ్రామీణాభివృద్ధి నెరవేరుతోందని కూటమి నేతలు పేర్కొన్నారు. స్థానిక హనుమాన్‌నగర్‌లో ఉపాధి నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణానికి దయాల రాజేశ్వరరావు, చలమలశెట్టి రమేష్ బాబు, తదితరులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతో పల్లె ప్రగతికి బాటలు పడుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు తాడిశెట్టి శ్రీను, కడవకొల్లు రాజేష్, వరిగం జికిషోర్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



బహుమతులు సాధించిన విజేతలతో కోచ్ వెంకట్రావు

కరాటేలో గన్నవరం విద్యార్థుల ప్రతిభ

గన్నవరం : ఓపెన్ జాతీయ కరాటే పోటీల్లో తమ విద్యార్థులు ప్రథమ స్థానంలో రాణించినట్లు కోచ్ ఉప్పులూరి వెంకట్రావు తెలిపారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల క్రీడాప్రాంగణంలో విజేతల అభినందన సభ సోమవారం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ, చిలకలూరిపేటలోని పద్మావతి ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో ఈ నెల 8న జరిగిన ఓపెన్ జాతీయ కరాటే పోటీల్లో పలు రాష్ట్రాల నుంచి 850 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు తెలిపారు. గన్నవరానికి చెందిన షోటోకాన్ కరాటే స్కూల్ విద్యార్థులు అండర్-12 విభాగం కటస్ కేటగిరిలో ఎం.రామ్ తేజ, ఎచల్సీ, జె.వేదా శ్రీ, కె.సలోమి సువర్ణ, పి.సంజన, జె.లోకేష్, ఎం.మోహిత్‌లు, అండర్-14 విభాగంలో కె.హేమంత్, కె.శ్రేయస్, టి.మనోరంజిత్, వి.పార్థు, కె.సిద్ధు, జె.సాయి రోషన్, ఆర్.దుర్గ, కె.పర్తికలు ప్రథమ స్థానం సాధించారు. నిర్వాహకులు విజేతలకు మెమెంటోలు, ట్రోఫీ, సర్టిఫికెట్లు అందజేసినట్టు తెలిపారు. విజేతలను వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఆర్ కిషోర్ తదితరులు అభినందించారు.

శ్రీఎంకే స్కూల్ విద్యార్థులకు పతకాలు



ఉయ్యూరు : జాతీయ ఓపెన్ కరాటే చాపియన్‌షిప్ -2024 మెగా ఈవెంట్‌లో శ్రీఎంకే ఇంగ్లీ షుమీడియం హైస్కూల్ విద్యార్థులు పతకాలు సాధించారు. గుంటూరు ఎన్టీఆర్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జరిగిన పోటీల్లో స్కూల్ నుంచి 21 మంది పాల్గొనగా అందులో ఎనిమిది మంది ప్రథమ, నలుగురు ద్వితీయ, తొమ్మిది మంది తృతీయ బహుమతులు సాధించి ఏపీ టెక్నికల్ డైరెక్టర్ ఎస్.వెంకటేశ్వరరావు నుంచి పతకాలు అందుకున్నారు. ఈసందర్భంగా సోమవారం విద్యార్థులను, కోచ్ రామకృష్ణను పాఠశాల డైరెక్టర్ ఎంకే బాబు అభినందించారు.

ఘనంగా శ్రీచైతన్య ఐఐటీ అకాడమీ వార్షికోత్సవం

పెనమలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీచైతన్య ఐఐటీ డేస్కాలర్స్ కళాశాలల వార్షికోత్సవం కానూరు మన కళ్యాణ మండపంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. గాయత్రి, మయూరి, శ్రీభాస్కర్ క్యాంపస్‌ల విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పాల్గొన్న వేడుకలకు ముఖ్య అతిథిగా రైల్వే డివిజనల్ మేనేజరు నరేంద్ర ఆనంద్‌రావు పాటిల్ హాజరై మాట్లాడుతూ, విద్యార్థులకు చదువు పట్ల చక్కటి అవగాహన కల్పించారు. గతేడాది ఐఐటీ, ఎన్ఐటీ జాతీయ ప్రవేశ పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు పతకాలు, జ్ఞాపికలు అందజేశారు. ముందుగా శ్రీచైతన్య విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ ఏజీఎం మద్దినేని మురళీకృష్ణ జ్యోతి ప్రజ్వలన చేశారు.

విద్యుత్ చౌర్యం చట్ట రిత్యా నేరం

కంకిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ చౌర్యం చట్ట రిత్యా నేరమని విద్యుత్ శాఖ విజిలెన్స్ విభాగం ఈఈ కె.వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కన్వెన్షన్ సెంటర్‌లో విజిలెన్స్ వింగ్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగంపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, విద్యుత్ చౌర్యం చట్ట రిత్యా నేరమన్నారు. అనుమతి తీసుకున్న లోడు కంటే అధిక విద్యుత్ వినియోగిస్తున్న 165 సర్వీసులకు సంబంధించి రూ. 5.85 లక్షల అదనపు రుసుం వినియోగదారుల నుంచి వసూలు చేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఈఈ పి.హరిబాబు, డీఈఈ బినవీన్‌కుమార్, కంకిపాడు ఏఈ టి.అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వీరంకి గురుమూర్తిని సత్కరిస్తున్న వైవీబీ రాజేంద్ర ప్రసాద్

కష్టపడి పనిచేసిన వారికి ప్రతిఫలం

ఉయ్యూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఏరంగంలో కృషి పట్టుదలతో కష్టపడి పనిచేసేవారికి ప్రతిఫలం రావడం ఖాయమని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ గౌడ వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి వెంకటగురుమూర్తిని సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పట్టుదలతో కష్టపడి పనిచేసిన వారికి ప్రతిఫలం తప్పక లభిస్తుందని, గురుమూర్తి 25 సంవత్సరాలుగా ఏపీ పంచాయతీరాజ్‌చాంబర్ ద్వారా ఎన్నో ఉద్యమాలు, పోరాటాల్లో పాల్గొన్నారని గుర్తుచేశారు. టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఫణికుమార్, మైనారిటీ సెల్ కార్యదర్శి అజ్మతుల్లా, తదితరులు గురుమూర్తికి అభినందనలు తెలిపారు.



ఆక్రమణల తొలగింపులో స్వల్ప ఉద్రిక్తత

పెనమలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెనమలూరు నుంచి చోడవరం వెళ్లే రోడ్డు నిర్మాణం, విస్తరణ, మరమ్మతులకు నిధులు మంజూరై పనులు జరుగుతుండగా పెనమలూరు హైస్కూలు సెంటరు నుంచి చెరువు, అంబేడ్కర్ బొమ్మ వరకు ఉన్న ఆక్రమణలను తొలిగించే వ్యవహారంలో అధికారులకు, స్థానికులకు మధ్య స్వల్ప ఉద్రిక్తత చోటుచేసుకొంది. రెవెన్యూ అధికారులు పోలీసుల సాయంతో రోడ్డు పక్కన ఉన్న ఆక్రమణలను తొలిగించే ప్రయత్నం చేయగా, తమకు ముందస్తుగా ఎందుకు చెప్పలేదని స్థానికులు నిలదీశారు. ఆక్రమణదారులకు గతంలోనే జగనన్న కాలనీల్లో స్థలాలు ఇచ్చామని, రోడ్డు ఎన్నో ఏళ్లుగా ఆక్రమణలకు గురై ఇరుకుగా మారడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇప్పటికిప్పుడు ఎక్కడికి వెళతామంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. వారికి మద్దతుగా సీపీఎం నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. స్వల్ప ఉద్రిక్త పరిస్థితిని సీఐ వెంకటరమణ సిబ్బందితో అదుపులోకి తెచ్చారు.

ఎమ్మెల్యే చొరవతో రహదారికి మోక్షం

ప్రసాందపాడు, డిసెంబరు 9(ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడు శక్తి కళ్యాణ మండపం రోడ్డు నిర్మాణం గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు చొరవతోనే సాధ్యమైందని టీడీపీ నేతలు పేర్కొన్నారు. సోమవారం ఎనికేపాడులోని పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడుతూ, ఎమ్మెల్యే కృషితో రూ.3.54 కోట్లతో రోడ్డు పనులు చేపట్టేందుకు సీఆర్డీయే టెండర్లు రూపొందించినట్టు తెలిపారు. ఈ రోడ్డు పూర్తయితే స్థానిక గ్రామాల ప్రజలతో పాటు కానూరు, ఆటోనగర్ వైపు వెళ్లేవారికి అనువుగా ఉంటుందన్నారు. టీడీపీ నేతలు గూడవల్లి నరసింహారావు, సర్నాలబాలాజీ, బొప్పన హరికృష్ణ, కోనేరు సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్షలకు విశేష స్పందన

గన్నవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : చిన అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల బోధన ఆస్పత్రిలో ఉచిత రక్త పరీక్షలకు విశేష స్పందన లభించిందని మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తొలిరోజైన సోమవారం 920 మంది ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. ఈ నెల 16 వరకూ ఉచిత రక్త పరీక్షలు, ఓపీతో పాటు గుండె సంబంధిత సీటీ కార్డియో, యాంజియోగ్రామ్, ఈసీజీ, 2డి ఎకో, సిరమ్ క్రియాటిన్ పరీక్షలు, సీఈసీటీ స్కానింగ్‌లు, ఎక్స్‌రే, మమోగ్రఫీ స్కాన్, సీటీ స్కాన్‌లపై ప్రత్యేక రాయితీ ఇస్తున్నట్టు తెలిపారు.

'విజయ' బోనస్ చెక్కుల పంపిణీ

గన్నవరం, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాడిరైతుల సంక్షేమానికి విజయడెయిరి అధిక ప్రాధాన్యతను ఇవ్వటంతో పాటు పశుపోషణను ప్రోత్సహిస్తుందని డైరెక్టర్, మాజీ ఎమ్మెల్యే దాసరి వెంకట బాలవర్ధనరావు అన్నారు. స్థానిక విజయ పశుదాణ కర్మాగారంలో సొసైటీలకు సోమవారం చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా బాలవర్ధనరావు మాట్లాడుతూ, జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.12.09 కోట్లు పాడి రైతులకు ధర వ్యత్యాసం ప్రకటించారన్నారు. క్లస్టర్ పరిధిలో 96 పాల సొసైటీలకు రెండవ విడతగా నాలుగు నెలలకుగాను రూ.67.28లక్షలు బోనస్‌ను ఇస్తున్నామన్నారు. డైరెక్టర్ పలగాని కొండలరావు, ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై వ్యక్తి మృతి

రైల్వేస్టేషన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గన్నవరం-ముస్తాబాద మధ్య రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందినట్టు సోమవారం రైల్వే పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గన్నవరం-ముస్తాబాద మధ్య డౌన్ మెయిన్ రైల్వే ట్రాక్‌పై వ్యక్తి చనిపోయినట్టు సమాచారం రైల్వే అధికారులు, జీఆర్పీ పోలీసులకు తెలిసింది. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లేనందున్న పోస్టుమార్టం నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి సుమారు 45 సంవత్సరాల వయస్సు ఉంటుందని, ఒంటిపై తెలుపు రంగు ఫుల్‌హ్యాండ్ షర్టు ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

విద్యుత్ వాహనాలపై పరిశోధనలు అవసరం

విజయవాడ కల్చరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి సమీపంలోని ఎన్‌ఆర్‌ఐ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సోమవారం ఎఐసీటీఈ అటల్ ప్రాయోజిత అధునాతన స్థాయి అధ్యాపక నైపుణ్యాభివృద్ధి సదస్సు జరిగింది. సదస్సులో కళాశాల చైర్మన్ ఆర్.వెంకట్రావు మాట్లాడుతూ, రాబోయే రోజుల్లో విద్యుత్ వాహనాల వినియోగం మరింత పెరుగుతుందని దానికి తగ్గట్టుగా అధ్యాపకులు విద్యుత్ వాహనాలపై మరింత పరిశోధన చేయాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.నాగభాస్కర్ మాట్లాడుతూ, విద్యుత్ వాహనాల పనితీరును మరింత అభివృద్ధి పరిచేలా అధ్యాపకులు పరిశోధన చేసి పేటెంట్స్ పొందాలని సూచించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన పి.శంకర్ మాట్లాడుతూ, ఎలక్ట్రిక్ వాహనాలలో పవర్ ఎలక్ట్రానిక్స్ పరికరాలు ఎలా ఉపయోగించాలో వివరించారు. కార్యక్రమంలో ఎన్‌ఆర్‌ఐ కళాశాల ఈఈఈ అధ్యాపకులు, వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు పాల్గొన్నారు.



అధ్యాపక నైపుణ్యాభివృద్ధి సదస్సులో లెక్చరర్లు, ఎన్‌ఆర్‌ఐ కళాశాల చైర్మన్ వెంకట్రావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ప్రణాళికతో పని చేయండి

- ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రణాళికతో పనిచేస్తే గ్రామాభివృద్ధి సాధ్యమవుతుందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మండల పరిషత్ సమావేశమందిరంలో సోమవారం సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. నియోజకవర్గంలో మూడు మండలాల అభివృద్ధికి రూ.23 కోట్లు కేటాయించగా ఒక్క కంకిపాడు మండలానికే సుమారు రూ.10 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మీ, వైఎస్ ఎంపీపీ ధూళిపూడి కిషోర్, ఎంపీడీవో అనూష్, పీఆర్ డీఈ శ్రీనివాస్, వ్యవసాయశాఖ ఏఈ పి.ఎం. కిరణ్ కుమార్, విద్యుత్ శాఖ ఏఈ అశోక్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

దివ్యాంగునికి చేయూత

పెనమలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పోరంకి బీజేఆర్‌నగర్‌కు చెందిన గొల్లమండల ఆనంద్ అనే దివ్యాంగునికి యువనేత బోడె వెంకట్రాం ఎనిమిదివేల విలువైన వీల్‌చైర్‌ను అందజేసి ఉదారతను చాటుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు ఆకునూరు సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీలోని బీజేఆర్ నగర్‌లోని రోడ్లు, డ్రెయినేజీలను బోడె వెంకట్రాం సోమవారం పరిశీలించారు.

సాగర్ కమిటీ చైర్మన్ పీఠంపై ఉత్కంఠ

- ఎన్టీఆర్ జిల్లాలోనే అత్యధిక కమిటీలు, డీసీలు
- చైర్మన్ పదవిపై కన్నెత్తి చూడని జిల్లా ఎంపీ, ఎమ్మెల్యేలు
- అసంతృప్తి వ్యక్తం చేస్తున్న జిల్లా సీనియర్ నేతలు

ఆంధ్రజ్యోతి-నందిగామ: ప్రతిష్ఠాత్మకమైన నాగార్జున సాగర్ (ఎన్ఎస్ఎల్‌బీసీ) ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవి పీఠంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొని ఉంది. మెజారిటీ ఆయకట్టు, ఎక్కువ డిస్ట్రిబ్యూటరీ కమిటీలున్న ప్రాంతాన్ని వీడి ప్రాజెక్ట్‌లో నామమాత్రపు ప్రాతినిధ్యం గల ప్రాంతానికి చైర్మన్ పదవి కట్టబెడుతున్నారన్న సమాచారం పెద్దయెత్తున విమర్శలకు దారి తీస్తోంది. పదవులు కేటాయింపులో సామాజిక, ప్రాంతీయత వంటి అంశాలనూ నిశితంగా పరిశీలించే టీడీపీ ప్రాజెక్ట్ కమిటీ విషయంలోనూ ఆచితూచి నిర్ణయం తీసుకుంటే బాగుంటుందని పార్టీ నేతలు అభిప్రాయ పడుతున్నారు. ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలోని ప్రాజెక్ట్ కమిటీ పదవిని అత్యధిక డీసీలు, అత్యధిక ఆయకట్టు గల ఎన్టీఆర్ జిల్లాకు కేటాయించాల్సి ఉందని అభిప్రాయపడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు మంత్రి పదవి కూడా కేటాయించని ప్రభుత్వ పెద్దలు కనీసం జిల్లా స్థాయిదైన ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవినైనా కేటాయించాలని డిమాండ్ చేస్తున్నారు.


మరమ్మతులకు నోచుకోని ఎన్ఎస్‌పీ కాలువలు

జిల్లాల వారీగా డీసీ పదవులు

ప్రాజెక్ట్ కమిటీ పరిధిలో మొత్తం 17 డిస్ట్రిబ్యూటరీ కమిటీలున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలో 13 కమిటీలుండగా, కృష్ణా, ఏలూరు జిల్లాల పరిధిలో రెండేసి చొప్పున డిస్ట్రిబ్యూటరీ కమిటీలున్నాయి. ఎన్టీఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట పరిధిలో రెండు డీసీలు, నందిగామ పరిధిలో 4 డీసీలు, మైలవరం పరిధిలో 4 డీసీలు, తిరువూరు పరిధిలో 3 డీసీలున్నాయి. మూడు వంతులకు పైబడి డీసీలు కలిగి ఉన్న ఎన్టీఆర్ జిల్లా అదే స్థాయిలో ఆయకట్టు కూడా కలిగి ఉంది. ఎన్టీఆర్ జిల్లాలో 13 డీసీల పరిధిలో సుమారు రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టు ఉండగా, ఏలూరు జిల్లాలో 35 వేలు, కృష్ణాజిల్లాలో 35 వేల ఎకరాలు మాత్రమే ఆయకట్టు ఉంది. దీన్నిబట్టి ప్రాజెక్ట్ కమిటీలో అత్యధిక భాగం కలిగి ఉన్న ఎన్టీఆర్ జిల్లాకు చైర్మన్ పదవి కేటాయించడమే సముచితమని రైతులు భావిస్తున్నారు.

కాలువల విస్తరణ, నీటి పంపిణీ

ఎన్ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్ట్ కమిటీ పరిధిలోని ఆయకట్టుకు తెలంగాణ నుంచి 3528 క్యూసెక్కుల నీరు విడుదలౌతుంది. ఈ నీటి ప్రవాహానికి చివరి భూములు కూడా ఎన్టీఆర్ జిల్లాలోనే ఉన్నాయి. ఇదిలా ఉండగా, నందిగామ పరిధిలో సుమారు 68 ఎత్తిపోతల పథకాలున్నాయి. వీటి నుంచి భారీగా నీరు విడుదలౌతుంది. జగ్గయ్యపేట, మైలవరం పరిధిలోనూ పలు ఎత్తిపోతల పథకాలు నీటిని తోడి పోస్తున్నాయి. సాగర్ నీటి కంటే అధిక మొత్తంలో నీరు ఎత్తిపోతల పథకాల నుంచి వస్తుంది. ఎన్ఎస్‌పీ కాలువల ద్వారానే ఈ నీటి పంపిణీ జరుగుతుంది. ఈ లెక్కన కమిటీ తన విధులను 90శాతం ఎన్టీఆర్ జిల్లాలోనే చేపట్టాలి. వైసీపీ హయాంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురై కునారిల్లుతున్న కాలువలకు పూర్తిస్థాయి మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. ఈ అంశాలను పరిగణంలోకి తీసుకుంటే కమిటీ చైర్మన్ పదవిని ఎన్టీఆర్ జిల్లాకే కేటాయించాలి.

నిర్లక్ష్యమెందుకో...

90 శాతం జిల్లాలో అంతర్భాగమై ఉన్న ప్రాజెక్ట్ కమిటీ పదవిని దక్కించుకొనేందుకు ఎన్టీఆర్ జిల్లా ప్రజాప్రతినిధులు ఏమాత్రం దృష్టి సారించకపోవడం విస్మయం కలిగిస్తోంది. గతంలో నామినేటెడ్, పార్టీ పదవులతో పాటు ఏదైనా జిల్లాస్థాయి పదవులుంటే ఎమ్మెల్యేలు ఎవరికి వారు తమ నియోజక వర్గాలకు దక్కాలని ఆరాటపడేవారు. ఎవరికి వారు పోటీపడి అధిష్ఠానం వద్ద పావులు కదిపేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ఎమ్మెల్యేలు, ఎంపీ లైట్ తీసుకున్నట్టు తెలుస్తోంది. ఏలూరు జిల్లాకు చెందిన ఒక నేతకు ఈ పదవిని కట్టబెడుతున్నట్టు తెలుస్తోంది. దీనిపై జిల్లాలోని పలువురు సీనియర్ నేతలు పెదవి విరుస్తున్నారు. సదరు నేతకు పార్టీ అధిష్ఠానం ఆశీస్సులేమైనా ఉన్నాయా లేక తమకెందుకులే అని జిల్లా ప్రజాప్రతినిధులు వదిలేశారా అన్న చర్చ సాగుతుంది. మెజారిటీ ప్రాంతానికే ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పీఠం అందేలా ఎమ్మెల్యేలు, ఎంపీతో పాటు పార్టీ పెద్దలు చర్యలు చేపట్టాలని కూటమి ద్వితీయ శ్రేణి నేతలు డిమాండ్ చేస్తున్నారు. సముచిత నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు.

89 మంది మహిళల మిస్సింగ్ కేసులు

నెల రోజుల్లో పరిష్కారం

గుణదల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నెల రోజుల్లో 89 మహిళా మిస్సింగ్ కేసులను ఛేదించడం జరిగిందని నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు తెలిపారు. ఉమెన్ మిస్సింగ్ కేసుల పురోగతిపై చర్చించేందుకు నగర పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర్ బాబు కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల అధికారులతో జూమ్ మీటింగ్ సోమవారం నిర్వహించారు. ఉమెన్ మిస్సింగ్ కేసుల పరిష్కారం నిమిత్తం ఈ ఏడాది నవంబరు 10న డీసీపీ గౌతమి షాలి ఆధ్వర్యంలో సీఐ చంద్రశేఖర్, మహిళా ఎస్ఐ యు.హైమావతితో ఒక ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రత్యేక బృందం ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని ఈ మిస్సింగ్ కేసులను ఛేదించినట్టు తెలిపారు. ఈ మహిళలను వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చామన్నారు. అదేస్ఫూర్తితో మిగిలిన కేసులను కూడా త్వరగా ఛేదించాలన్నారు.

విద్యార్థి ఆత్మహత్య

పెనమలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ శివారు పెనమలూరు మండలంలోని ఒక కార్పొరేట్ కళాశాలలో నీట్ లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకొంటున్న విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకొన్న ఘటన జరిగింది. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నంద్యాలకు చెందిన బణావత్ పరమేష్ నాయక్ (19) అనే విద్యార్థి పోరంకిలోని ఒక కార్పొరేట్ కళాశాల వసతి గృహంలో నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకొంటున్నాడు. ఆదివారం రాత్రి తోటి విద్యార్థులతో కలిసి క్యాంపస్‌లో సినిమా చూసి నిద్రకు ఉపక్రమించాడు. తెల్లవారు జామున విద్యార్థులు నిద్ర లేచి చూసేసరికి బట్టలు ఆరేసుకొనే ఇనుపరాడ్‌కు ఉరేసుకొని ఉన్నాడు. అప్రమత్తమైన కళాశాల యాజమాన్యం విద్యార్థిని ఉయ్యూరు ప్రభుత్వాసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు తేల్చారు. విద్యార్థి మృతి వార్త తెలుసుకొన్న అతడి తల్లిదండ్రులు కళాశాల వద్దకు వచ్చి కళాశాల యాజమాన్యం నిర్లక్ష్యం వల్లే తమ కుమారుడు మృతి చెందాడని ఆందోళన వ్యక్తం చేశారు.

కొత్తూరు తాడేపల్లి, నున్నలో క్వారీల తనిఖీ

వన్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు తాడేపల్లి, నున్న అటవీ శాఖ బీట్ పరిధిలో ప్రైవేట్ భూముల్లో గ్రావెల్స్ కోసం యజమానులు చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ (ఎన్‌వోసీ) ఇవ్వచ్చునా లేదా అన్న దానిపై సోమవారం క్షేత్రస్థాయిలో భౌతిక పరిశీలన చేశారు. ఆయా బీట్ పరిధిలో సుమారు 33 మంది గ్రావెల్ తవ్వకాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటికే కొంతమంది గ్రావెల్ తవ్వకాలను ప్రారంభించారు. అవి ఏ మేరకు అనుమతించదగినవా? కాదా అనే దానిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్క్వాడ్ డీఎఫ్‌వో టి.శ్రీనివాసరావు, స్క్వాడ్ రేంజర్ రాజా స్థానిక డీఎఫ్‌వో పోతురాజు, కొత్తూరు తాడేపల్లి బీట్ ఆఫీసర్ శంకర్‌తో కలిసి ఆయా బీట్ల పరిధిలో క్వారీ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ఈ నివేదికను స్క్వాడ్ అధికారులు పై స్థాయి అధికారులకు పంపించనున్నారు.

శిక్షణకు 50 మంది తిరువూరు యువత

వన్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ అభివృద్ధి సంస్థ యువతకు నిర్వహిస్తున్న ఉపాధి అవకాశాల అవగాహన సదస్సుకు విజయవాడ పార్లమెంట్ పరిధిలోని తిరువూరు నుంచి 50 మంది యువత పాల్గొన్నారు. అలాగే ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ మేరకు ఎంపీ కేశినేని శివనాథ్ కార్యాలయం సోమవారం ఒక ప్రకటన చేసింది. హైదరాబాద్ రాజేంద్ర నగర్‌లోని జాతీయ గ్రామీణ అభివృద్ధి పంచాయతీరాజ్ సంస్థలో అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారన్నారు. ఎంపీ శివనాథ్ ఆధ్వర్యంలో మొదటి విడతగా తిరువూరు నుంచి 50 మంది పాల్గొన్నారు. గ్రామీణాభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ జి.నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఈ రంగంలో నిధులు, పథకాలపై వివరించారు. 15కు పైగా స్వయం ఉపాధి పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు.

రేపు క్యారమ్స్ జట్ల ఎంపికలు

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కృష్ణా స్కూల్ గేమ్స్ అండర్ -19 పర్యవేక్షణలో ఈ నెల 11న ఉదయం 10 గంటలకు నగరంలోని ఇందిరా గాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలోని క్యారమ్స్ అసోసియేషన్ హాల్లో ఎస్‌జీఎఫ్ బాలబాలికల క్యారమ్స్ జట్ల ఎంపికలను నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి వీ రవి కాంత ఒక ప్రకటనలో తెలిపారు. పీఈటీ పీడీలు ఈ విషయాన్ని గమనించి జిల్లా ప్లేయర్ ఎంట్రీ ఫారంలో పెన్ నెంబర్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్, ఇతర వివరాలను పూర్తి చేసుకుని ఆ రోజు హాజరు కావాలని ఆమె తెలిపారు.

చోరీ కేసులో నిందితురాలి అరెస్టు

- రూ.12.50 లక్షల బంగారం స్వాధీనం

తిరువూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బంగారం చోరీకేసులో నిందితురాలిని అదుపులోకి తీసుకొని ఆమె నుంచి రూ.12.50 లక్షల బంగారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో విజయవాడ రూరల్ డీసీపీ మహేశ్వరరాజు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 7న విజయవాడ భవానీపురం నుంచి కంచి నవ్యశ్రీ ఆమె బంధువులు తిరువూరులోని ఫ్యాక్టరీ సెంటర్‌లో బస్సు దిగి ఇంటికి వెళ్లేందుకు ఆటో ఎక్కగా వీరినే అనుసరిస్తూ వచ్చిన ఇద్దరు మహిళలు వీరితో పాటు ఆటో ఎక్కి, బ్యాగుల్లోని బంగారం అపహరించి వెళ్లిపోయారన్నారు. బాధితులు ఇంటికి వెళ్లి చూసుకోగా బ్యాగులో బంగారం లేకపోవడంతో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ గిరిబాబు నేతృత్వంలో 3 టీమ్‌లు దర్యాప్తు చేపట్టారు. ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సమ్మెటవారిగూడెంకు చెందిన మేకల లక్ష్మి పట్టణ శివారు ఆంధ్ర సరిహద్దు చెక్‌పోస్టు వద్ద అనుమానాస్పదంగా సంచరిస్తుండగా సీఐ, ఎస్సైలు అదుపులోకి తీసుకొని సోదా చేశారు. ఆమె వద్ద బంగారం దొరకడంతో విచారించగా ఆటోలో బంగారం తానే అపహరించినట్టు చెప్పడంతో ఆమెను అరెస్టుచేసి బంగారం స్వాధీనం చేసుకున్నామని, మరో నిందితురాలి కోసం గాలిస్తున్నట్టు తెలిపారు. చోరీ జరిగిన 24 గంటల్లో కేసు ఛేదించిన పోలీసు సిబ్బందిని డీసీపీ అభినందించారు.

నిందితురాలిపై పలు కేసులు

బంగారం చోరీ కేసులో నిందితురాలు మేకల లక్ష్మిపై ఖమ్మం, పశ్చిమగోదావరి, ఎన్టీఆర్ జిల్లాలో పలు కేసులు నమోదైనట్టు డీసీపీ తెలిపారు. వీఎం బంజరు, కల్లూరు, విస్సన్నపేట, చింతలపూడి పోలీస్ స్టేషన్లలో పలు కేసులు నమోదైనట్టు వివరించారు. మైలవరం ఏసీపీ వైప్రసాదరావు, సీఐ గిరిబాబు, ఎస్సైలు కేవీజీవీ సత్యనారాయణ, వెంకట్రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.


బంగారు వస్తువులు పరిశీలిస్తున్న డీసీపీ మహేశ్వరరాజు


అంధ బాలబాలికలను ఉద్దేశించి మాట్లాడుతున్న ఒంగోలు జిల్లా జడ్జి రాములు

నాదీ మీ బడే.. ఇక్కడ చదివే పైకొచ్చా..!

- లక్ష్యసాధనకు వైకల్యం అడ్డుకారాదు: న్యాయాధికారి రాములు

గుణదల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): 'ఉన్నత శిఖరాలే లక్ష్యంగా ఎంచుకుని విద్యాభ్యాసం చేస్తే వైకల్యమనేది లక్ష్యసాధనకు అడ్డు కానేకాదని, చిన్నప్పుడు తాను కూడా మిషనరీ స్కూల్‌లోనే చదువుకున్నానని' ఒంగోలు జిల్లా న్యాయాధికారి రాములు అన్నారు. గుణదల్లోని విజయమేరి అంధ పాఠశాలను ఆయన సందర్శించారు. క్రిస్టియన్ మిషనరీ సంస్థ అంధ బాలబాలికలకు వసతి, విద్యాబోధన అందించడం గర్వించదగిన విషయమన్నారు. తన విద్యాభ్యాసం మొత్తం మిషనరీ పాఠశాలలు, కళాశాలల్లోనే సాగిందని నేడు తానీ స్థాయిలో ఉన్నానంటే దానికి లయోల విద్యాసంస్థలే కారణమన్నారు. అంధులు నేడు చాలామంది ఉన్నతస్థాయిలో ఉన్నారని దానికి కారణం వారిలో పట్టుదల పోటీతత్వమే ప్రధాన కారణమన్నారు. కడుపేదరికంలో ఉన్నవారికి సైతం క్రిస్టియన్ మిషనరీ సంస్థలు ఆశ్రయం కల్పించి విద్యా, వైద్యం అందించడం గర్వించదగిన విషయమన్నారు. ఇలాంటి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కోరారు. చిన్ననాటి నుంచి పోటీతత్వం అలవర్చుకుంటే మంచి ప్రయోజకులవుతారన్నారు. పోటీతత్వంతోపాటు ఓటమిని అంగీకరించడం విజయసాధనకు కృషి చేయడం అలవర్చుకుంటే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ దైవభక్తిని అలవర్చుకుంటే మంచిమార్గంలో నడుస్తారన్నారు. విజయమేరీ అంధ బాలబాలికల పాఠశాలలో 130 మంది వసతి పొందడం విద్యనభ్యసించడం చాలా ఆనందంగా ఉందన్నారు. మీకు ఏ అవసరం ఉన్నా అండగా నిలబడతానని అభయమిచ్చారు. ఒక్కొక్క చిన్నారిని దగ్గరకు తీసుకుని సాధకబాధలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బాలబాలికల ప్రార్థనలో పాల్గొన్నారు. పాఠశాల కరస్పాండెంట్ సిస్టర్ తరశిల్లా పాల్గొన్నారు.

వేతన బకాయి విడుదల చేయాలి

- కలెక్టర్‌కు వెలుగు యానిమేటర్స్ సంఘం సభ్యుల విన్నపం



కృష్ణలంక, డిసెంబరు 8 (ఆంధ్రజ్యోతి): వెలుగు డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్న డ్వాక్రా వీవోఏ (వెలుగు యానిమేటర్స్ ఉద్యోగుల సంఘం)లకు మూడేళ్ల కాలపరిమితి సర్క్యులర్ వారి మెడకు ఉరితాడులా మారిందని, 5 నెలల వేతన బకాయిలు ఇవ్వలేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎ.వెంకటేశ్వరరావు తెలిపారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ మేరకు కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పనిచేస్తూ ఇదే ఉపాధిగా చేసుకొని జీవనం సాగిస్తున్నారని, డ్వాక్రా సంఘాల్లోని పేద మహిళలను కూడగట్టడంలో, బ్యాంకు లావాదేవీల్లో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో, కొత్తగ్రూపులను ఏర్పాటు చేయడంలో, వీవోఏలు కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అలాంటి వారికి ఈ సర్క్యులర్ అమలు వలన, వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. గత వైసీపీ ప్రభుత్వం తెచ్చిన ఈ సర్క్యులర్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈనెల 13న జరిగే రాష్ట్ర ధర్నాలో పెద్దసంఖ్యలో వీవోఏలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షురాలు కమల, వీఏవో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఎస్‌కే చాంద్ బేగం, జిల్లా నేతలు సుజాత, వీరులపాడు సీఐటీయూ మండల కార్యదర్శి ఎస్‌కే లాల్ అహ్మద్ గౌస్ పాల్గొన్నారు.


దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సత్యనారాయణకు చిత్రపటం, శేషవస్త్రం అందజేస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు

దుర్గమ్మ సన్నిధిలో దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ

వన్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సత్యనారాయణ సోమవారం దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు ఆలయ మర్యాదలు అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం డిప్యూటీ ఈవో రత్నరాజు ఆయనకు చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు. వేద పండితులు ఆశీస్సులందజేశారు.


ఓవరాల్ చాంప్‌తో ఎన్టీఆర్ జిల్లా స్విమ్మర్లు

జాతీయ ఆక్వాటెక్స్‌లో ఓవరాల్ చాంప్ ఎన్టీఆర్

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం ఆర్‌కే బీచ్‌రోడ్డులోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈ నెల 7, 8న జరిగిన 9వ సబ్‌జూనియర్, జూనియర్ వింటర్ ఆక్వాటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఎన్టీఆర్ జిల్లా ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకుంది. జిల్లా నుంచి 41 మంది స్విమ్మర్లు బరిలో దిగగా, 24 స్వర్ణాలు, 22 రజతాలు, 13 కాంస్యాలతో మొత్తం 199 పాయింట్లతో అగ్రభాగాన నిలిచారు. ఎం సాయిత్ 25 పాయింట్లు, యు ప్రేమామృత 25 పాయింట్లు, ఎన్ పావని సరయు 25 పాయింట్లను వశం చేసుకున్నారన్నారు. పతకాలను సాధించిన స్విమ్మర్లను జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓబుల్‌రెడ్డి, ట్రెజరర్ కే రమేష్, సెక్రటరీ ఐ రమేష్‌తో పాటు కోచ్‌లు ఎం మాల్యాద్రి, ఏ లక్ష్మణ్, ఎస్‌కే రఫీ, ఎన్ నితీష్‌కుమార్, గౌతమ్ అభినందించారు.


విజేతలతో నిర్వాహకులు

జాతీయ కరాటేలో సత్తా

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఆదివారం రాత్రి హోరాహోరీగా సాగిన ఇన్విటేషనల్ సీఎం కప్ 15వ నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌లో విజేతలను నిర్వాహకులు జే హరినాథ్ ప్రకటించారు. బ్రహ్మం షిటోరియా కరాటే అకాడమీ ఇండియా ఆధ్వర్యంలో జరిగిన ఈ పోటీల్లో జేకే గోజుర్యో కరాటే అకాడమీ విద్యార్థులు పలువురు విజేతలుగా నిలిచారు. వీరిని జేకే ఫౌండర్ జే శ్రీనివాసులు అభినందించారు. నిర్వాహకులు జే దినేశ్, టీవీ సాయికుమార్, నర్సింహారెడ్డి, హర్ష, బ్రహ్మానందం, విజయ్‌కుమార్ పాల్గొన్నారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ విజేతలను అభినందించారు.

స్వర్ణాలు సాధించిన వారు: కే భువనసాయి, చార్వి అగర్వాల్, టీ హర్షిత, బీ లిప్సిక, డీ శరణ్య, జెనీత్, యస్విన్ సదాశివ, చుజిత్ మనీశ్వర్, వెంకట నాగ సాయి ప్రసాద్‌రెడ్డి, ఈశ్వర్ కృష్ణ సాధించగా, జే పునీష్ రెడ్డి, జే పుష్కర్‌రెడ్డి, ఎండీ అయాన్ రజతాలను వశం చేసుకున్నారు. జోష్విత, కే హేమంత్ కాంస్యాలను సాధించారని హరినాథ్ వివరించారు.

మార్కెట్లో గోల్డ్ మాఫియా డాన్!

- ఇతర ప్రాంతాల నుంచి అనధికారికంగా బంగారం తరలింపు
- వైసీపీ ప్రభుత్వంలో జోరుగా దొంగ బంగారం వ్యాపారం
- పలువురి నెత్తిన టోపీ.. డబ్బులిస్తానని హోటల్‌కు రమ్మని పరార్

వన్‌టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వాణిజ్య వ్యాపార కేంద్రమైన విజయవాడ వన్‌టౌన్‌లో బంగారం వర్క్‌షాపు నిర్వహిస్తున్న ఓ వ్యాపారి గోల్డ్ మాఫియా డాన్‌గా అవతారం ఎత్తాడు. బంగారం వ్యాపారులకు తక్కువ ధరకు బంగారం బిస్కెట్లు అమ్ముతానని మాయమాటలు చెప్పి మోసగించటంతో బాధితులు లబోదిబోమంటున్నారు. బాధితులకు డబ్బులిస్తామని కాలయాపన చేస్తూ కనిపించకుండా తిరగటంతో పలువురు రహస్యంగా క్రైం పోలీసులను ఆశ్రయించినట్టు తెలుస్తుంది. అక్కడి అధికారుల్లో కొందరు పరిచయం ఉండటంతో ఎలాంటి చర్యలు తీసుకోకుండా సెటిల్ చేసుకోమంటూ సూచనలిస్తున్నట్టు తెలుస్తోంది. కండ్రిక ప్రాంతానికి చెందిన 'ఆర్‌కే' అనే వ్యక్తి సుమారు 15ఏళ్ల క్రితం వన్‌టౌన్ మార్వాడీ వీధిలో బంగారం వ్యాపారి వద్ద గుమస్తాగా పనిచేశాడు. అనంతర కాలంలో ఆ వ్యాపారి వ్యాపారాన్ని ఆపేయడంతో అక్కడ పనిచేసిన ఆర్‌కే మాత్రం వన్‌టౌన్‌లో బంగారు ఆభరణాల వర్క్‌షాపును ప్రారంభించాడు. బంగారం బిస్కెట్లను ఇతర ప్రాంతాల నుంచి రహస్యంగా తెచ్చి పలువురు వ్యాపారులకు అమ్మటం ప్రారంభించాడు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్స్‌లను ఎగ్గొట్టి రోజుకు నాలుగైదు బిస్కెట్లు అమ్ముతూ బిస్కెట్‌పై రూ.60 నుంచి రూ.70వేల వరకు సంపాదిస్తున్నాడని బాధితులు ఆరోపిస్తున్నారు. వన్‌టౌన్‌లో మరో మూడు వర్క్‌షాపులు, రాధానగర్‌లో రూ.కోట్ల విలువైన రెండు బిల్డింగ్‌లను కొనుగోలు చేశాడు. ఈ ఏడాదిలో ఓ నేరస్థుడిని క్రైం పోలీసులు పట్టుకోగా, దొంగిలించిన బంగారాన్ని ఆర్‌కే అనే వ్యాపారికి అమ్మినట్టు విచారణలో బయటపడినట్టు సమాచారం. వైసీపీ ప్రభుత్వంలో ఓ మాజీ మంత్రికి ముఖ్య అనుచరుడిగా ఉంటూ అడ్డగోలుగా వ్యాపారం చేసిన ఈ డాన్ తనపై పోలీసు నిఘా ఉంటుందనే జాగ్రత్తతో ఓ అధికార పార్టీలోకి జంప్ అవ్వాలని ప్రయత్నించగా ఇతడి గురించి తెలుసుకున్న పార్టీ నేతలు చివాట్లు పెట్టి మళ్లీ కనిపించొద్దంటూ హెచ్చరించటంతో ఉత్తరాంధ్రలోని ఓ ఎంపీని, ఎమ్మెల్యేను కలిసి అధికార పార్టీలోకి రావటానికి ప్రయత్నాలు చేసినట్టు తెలుస్తోంది. ఈ డాన్ ఆగడాలతో తమ వ్యాపారం తగ్గిపోతోందని వ్యాపారులు ఆరోపిస్తున్నారు.

సీసీ రోడ్డుపై మరో సీసీ రోడ్డు

- కృష్ణా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు .. అధికారులపై ఆగ్రహం.. విచారణకు ఆదేశం

తోట్లవల్లూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అధ్వాన్న రోడ్లను వదిలేసి చక్కగా ఉన్న రోడ్లపైనే పై పూతగా మళ్లీ రోడ్డు నిర్మిస్తున్న వైఖరిపై గరికపర్రుకు చెందిన రైతు మైనేని తారాచంద్ సోమవారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. మండలంలోని గరికపర్రు శివారు వేణుగోపాలపురంలో సూరపనేని బాపయ్య ఇంటి నుంచి సూరపనేని వెంకట కృష్ణయ్య ఇంటి వరకు 2017లో రూ 3.50 లక్షలతో సిమెంటు రోడ్డు నిర్మించారని, ఈ రోడ్డు ఎక్కడా చెక్కు చెదరకుండా ఉందని, ఇదేరోడ్డుపై తాజాగా ఉపాధిహామీ నిధులు రూ.7.50 లక్షలు కేటాయించి ఆదివారం సిమెంటు రోడ్డు నిర్మాణం చేపట్టారని తారాచంద్ ఫిర్యాదులో పేర్కొన్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధి భర్త కాంట్రాక్టరుగా మారి ఈ రోడ్డు నిర్మిస్తూ నిధులను దుర్వినియోగం చేస్తున్నాడన్నారు. గ్రామంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ ఏరియాల్లో ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచని రోడ్లున్నాయని, వాటిని విస్మరించి మంచిగా ఉన్న రోడ్డుపైనే మరో రోడ్డు వేయటం వెనుక అవినీతి దాగుందని తెలిపారు. ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ బాలాజీ ఉన్నతాధికారులను తక్షణమే పిలిచి ఆగ్రహం వ్యక్తం చేశారని తెలిపారు. నిధుల కొరతను ఎదుర్కొంటున్న తరుణంలో రోడ్డుపై రోడ్డు ఎలా వేయిస్తారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్టు ఆయన తెలిపారు.


బాగున్న సీసీరోడ్డుపై కొత్తగా మరో సీసీ రోడ్డు నిర్మిస్తున్న కార్మికులు


బోల్తాకొట్టిన ఆటోలో నుంచి బయటపడిన గాయపడ్డ కూలీలు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

- పది మందికి స్వల్పగాయాలు

పామర్రు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పామర్రు- విజయవాడ ప్రధాన జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలవడంతోపాటు మరో 10 మందికి స్వల్ప గాయాలయ్యాయి. గూడూరు మండలం మల్లవోలు గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు ఆటోలో పనుల నిమిత్తం మండల పరిధిలోని కనుమూరు గ్రామానికి వస్తున్నారు. అలా వస్తు న్న ఆటో కురుమద్దాలి ఫ్లై ఓవర్ వంతెన సమీపిస్తున్న సమయంలో టైర్ పేలడంతో ఆటో బోల్తాకొట్టింది. దాంతో దీంతో తీవ్రగాయాలపాలైన ముగ్గురిని 108 అంబులెన్స్ ద్వారా బందరు ప్రభుత్వాసుపత్రికి చికిత్సకు తరలించారు. పేర్లు, వివరాలు వెల్లడి కాలేదు. కేసు ఎస్సై సీహెచ్ అనినాష్ దర్యాప్తు చేస్తున్నారు.

నవ ఆవిష్కరణలకు వేదిక పాలీటెక్ ఫెస్ట్

రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ జేడీ పద్మారావు


విద్యార్థుల ఆవిష్కరణలను పరిశీలిస్తున్న పద్మారావు

కృష్ణలంక, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): నవ ఆవిష్కరణలకు పాలీటెక్ ఫెస్ట్ ఓ గొప్ప వేదికని, యువ మెదళ్ల నుంచి వచ్చిన కొత్త ఆలోచనలకు ప్రతిరూపంగా విద్యార్థుల ప్రాజెక్టులున్నాయని రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ జేడీ వి.పద్మారావు అన్నారు. సోమవారం విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో రీజనల్ పాలీటెక్ ఫెస్ట్-2024ను పద్మారావు, ఎస్‌బీటీఈటీ కార్యదర్శి జీవీ రామచంద్రరావు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పద్మారావు మాట్లాడుతూ రీజనల్ పాలీటెక్ ఫెస్ట్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లా పరిధిలోని 5 ప్రభుత్వ, 10 ప్రైవేట్ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు 129 ప్రాజెక్టులను ప్రదర్శనకు ఉంచినట్టు తెలిపారు. మారుతున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా కొత్త ఆలోచనలకు ఆచరణ రూపమిచ్చి ప్రాజెక్టులను రూపొందించడం అభినందనీయమన్నారు. 8వ డివిజన్ కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎం.విజయసారథి, వివిధ విభాగాధిపతులు, పాలిటెక్నిక్ కళాశాలల ప్రిన్సిపల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఏషియన్ రోలర్ స్కేటింగ్‌కు సహకరిస్తాం

- శాప్ చైర్మన్ రవినాయుడు హామీ


వినతిపత్రం అందుకుంటున్న శాప్ చైర్మన్ రవినాయుడు, గిరిషా

విజయవాడ స్పోర్ట్సు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2027 సెప్టెంబర్‌లో జరిగే 21వ ఏషియన్ రోలర్ స్కేటింగ్ చాంపియన్‌షిప్‌కు శాప్ నుంచి సహాయ సహకారాలను అందిస్తామని చైర్మన్ అనిమిని రవినాయుడు, ఎండీ పీఎస్ గిరిషా హామీ ఇచ్చారు. ఈ చాంపియన్‌షిప్‌ను భారత్‌కు ఎలాట్ చేయగా, రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్‌కు కేటాయిస్తూ తన సమ్మతిని తెలిపింది. శాప్ చైర్మన్ రవినాయుడు మాట్లాడుతూ ఇలాంటి అంతర్జాతీయ క్రీడా ఈవెంట్‌ను రాష్ట్రానికి కేటాయించడం ఆనందంగా ఉందని, దీనికి కృషి చేసిన ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ సెక్రటరీ థామస్‌ను సత్కరించారు. టోర్నీలో 11 విభాగాల్లో 42 దేశాలకు పైగా 3000 మంది ప్రపంచస్థాయి స్కేటింగ్ క్రీడాకారులు జూనియర్, సీనియర్ ఏజ్ కేటగిరిలో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ టోర్నీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించేందుకు చంద్రబాబు సహకారంతో ముందుకెళ్తామన్నారు.



ఉల్లాసంగా ఉత్సాహంగా..

- సిద్ధార్థలో ఘనంగా ఫెట్

లబ్బీపేట, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని వ్యాపార, నైపుణ్యతా విలువలు వెలికి తీయడానికి ఇలాంటి ఫెట్‌లు దోహదం చేస్తాయని ఆంధ్రప్రదేశ్ క్రాఫ్ట్ కౌన్సిల్ చైర్ పర్సన్ సూరెడ్డి రంజన అన్నారు. సిద్ధార్థ మహిళా కళాశాలలో ఫెట్-2024 సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల మాజీ డైరెక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ కళాశాల 30 ఏళ్లుగా ఈ ఫెట్‌ను ఘనంగా నిర్వహిస్తోందని, విద్యార్థులెంతో ఉత్సాహంగా పాల్గొని తమ సృజనాత్మకతను ప్రదర్శిస్తారన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.కల్పన, స్పెషల్ ఆఫీసర్ ఆర్.మాధవి, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

సెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.625



వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.65 లక్షలు

గుడివాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాటిమీద వేంచేసియున్న వేంకటేశ్వరస్వామి దేవస్థానం హుండీల కానుకలను సోమవారం లెక్కించారు. రూ.3,65,953ల ఆదాయం సమకూరినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి కె.వి. గోపాలరావు తెలిపారు. ఆలయ సిబ్బంది, ఆండాళ్, భజన సమాజం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



తట్టివర్రులో నేల వాలిన వరి



రామన్నపూడిలో వరి కోత కోస్తున్న కూలీలు

అన్నదాతను వణికిస్తున్న వాతావరణం

● ఆందోళనలో వరి, మినుము రైతులు

గుడివాడ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అన్నదాతను వాతావరణం వణికిస్తోంది. మరలా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే మండలంలో అకాల వర్షాలు, తుఫాన్‌ల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోయారు. ముఖ్యంగా తట్టివర్రు, రామన్నపూడి, సిపూడి, అల్లిదొడ్డి తదితర గ్రామాల్లోని రైతులు నాట్లను ఆలస్యంగా వేయటం వల్ల వరి పంట ఆలస్యంగా చేతికి వచ్చింది. అధిక వర్షాలకు పంట మొత్తం నేలకొరిగిపోవటంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గత వర్షానికి తీవ్ర ఇబ్బందులు పడ్డామని, తుఫాన్ వస్తే మళ్లీ నష్టపోయే అవకాశం ఉందని రామన్నపూడి, తట్టివర్రు, చిన్నవానిగూడెం గ్రామాల రైతులు ఆందోళన చెందుతున్నారు. 11, 12 తేదీల్లో వర్ష సూచనను వాతావరణ శాఖ చెబుతున్నప్పటికీ కొందరు రైతులు వరి కోతలు కోస్తున్నారు. మరికొందరు ట్రాక్టర్లతో దుక్కులు చేసి మినుము విత్తనాలు చల్లుతున్నారు. పొలాల్లో మినుము పంట మొక్క దశలో ఉంది. చిరుజల్లులు పడితే అటు వరి, ఇటు మినుము పంటలు తీవ్రంగా నష్టపోతామని ఆందోళన చెందుతున్నారు.



తుఫాను హెచ్చరికలతో ఆందోళన

గత ఆగస్టులో కురిసిన వర్షానికి తీవ్రంగా నష్టపోయాం. నవంబరులో కురిసిన వర్షం కూడా నష్టాల్ని మిగల్చింది. మరల తుఫాన్ హెచ్చరికలతో ఆందోళన చెందుతున్నాం. - భట్టు రవికిరణ్



తట్టివర్రులో మినుము విత్తనాలు చల్లిన పొలం



వలివర్తిపాడులో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి

వరి కోతలు వాయిదా వేసుకోండి!

గుడివాడ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రైతులు త్వరపడి వరి కోతలు కోయరాదని ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి అన్నారు. సోమవారం వలివర్తిపాడు, మెరకగూడెం తదితర గ్రామాల్లోని రైతులతో ఏడీఏ మాట్లాడారు. వర్షాలు ఉన్నందున రైతులు కోతలు వాయిదా వేసుకోవాలని, ప్రతీ రైతు కోసిన వరి పనలను కుప్పలుగా వేసుకోవాలని, ధాన్యాన్ని త్వరగా ఇళ్లకు చేర్చుకోవాలని కోరారు. రాశులుగా ఉన్న వాటిని ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు చేర్చుకోవాలని సూచించారు. రైతులు వాతావరణ మార్పులను ఎప్పటికప్పుడు గమనించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏవో బోలెం అనంతలక్ష్మి, వీఏఏ ఆమోసు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి గింజ కొంటాం.. అధైర్యం వద్దు



రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

పమిడిముక్కల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పండించిన ప్రతి ధాన్యం గింజా ప్రభుత్వం తీసుకుంటుంది.. దళారులు, మధ్యవర్తులతో మోసపోయి రైతులు నష్టపోవద్దని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. కృష్ణాపురం శివారు ముదిరాజుపాలెంలో రోడ్లపై అరబెట్టిన ధాన్యం పరిశీలించి రైతుల సమస్యలపై ఆరాతీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆర్ఎస్‌కెలో టెక్నికల్ అసిస్టెంట్ చూపిన ధాన్యం శాతాన్ని మిల్లర్లు పరిగణలోకి తీసుకోవాలని, మిల్లర్లు ఇబ్బందులకు గురిచేస్తే కస్టోడియన్‌కు, తన దృష్టికి తేవాలని సూచించారు. అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తానని హామీఇచ్చారు. జనసేన నేత తాడిశెట్టి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో సమస్యల పరిష్కారం



రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ రామకోటేశ్వరరావు

గుడివాడ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సుల వల్ల రైతులకు చాలా సమస్యలు తీరుతాయని తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. సోమవారం బిళ్లపాడు, చిన ఎరుకపాడు గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లో భూ సమస్యలపై 10 దరఖాస్తులు వచ్చాయని, వీటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ప్రతీ రైతు తహసీల్దార్ కార్యాలయం వద్దకు రాకుండానే తమ సమస్యను పరిష్కరించుకోవటానికి రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగబాబు, వీఆర్వోలు, గ్రామాల రైతులు, మహిళలు పాల్గొన్నారు.

పమిడిముక్కల : భూసంబంధిత సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం అమలుచేస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఉయ్యూరు రెవెన్యూ డివిజినల్ అధికారి బీఎస్ హేలో షారన్ అన్నారు. గోపువాని పాలెంలో సోమవారం సదస్సులో ఆమె ప్రజలనుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ నవీన్‌కుమార్, సర్పంచ్ యార్లగడ్డ భూషయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

మహేశ్వరపురంలో మూడు అర్జీలు

పెదపారుపూడి : భూ సమస్యల సత్వర పరిష్కారానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ వై.రంగారావు అన్నారు. సోమవారం మహేశ్వరపురం గ్రామపంచాయతీ వద్ద జరిగిన రెవెన్యూ సభలో వివిధ సమస్యల నిమిత్తం మూడు అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో రీ సర్వే డీటీ సుందరరావు, ఆర్ఐ శ్రీనివాసరావు, వీఆర్వో దానియేలు, గ్రామస్థులు పాల్గొన్నారు.




ఘనంగా సోనియా జన్మదిన వేడుక

పామర్రు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పార్టీ అభివృద్ధి కోసం పదవులను తృణప్రాయంగా త్యజించిన త్యాగమూర్తి యూపీఏ చైర్‌పర్సన్ సోనియాగాంధీ అని నియోజకవర్గ సమన్వయకర్త, పీసీసీ ప్రధానకార్యదర్శి మొవ్వా మోహనరావు అన్నారు. పట్టణంలోని వాసవీ వృద్ధాశ్రమంలో సోమవారం పార్టీ ఆధ్వర్యంలో సోనియాగాంధీ జన్మదిన వేడుకల కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం 30 మంది వృద్ధులకు భోజనాలు అందజేశారు.

అధికారులు అందుబాటులో ఉండాలి

గుడివాడ రూరల్ : మండలంలో వివిధ శాఖల అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలని తహసీల్దార్ రామకోటేశ్వరరావు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో 'మీ కోసం' కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, డ్రైనేజీ శాఖలు ప్రజలకు అందుబాటులో ఉండాలని కోరారు.



జాతీయ స్థాయి అవార్డు అందుకుంటున్న చైర్మన్ లింగమనేని జగదీష్, ప్రిన్సిపాల్ స్రవంతి

శ్రీ సాయి షైనింగ్ స్టార్ స్కూల్‌కి జాతీయ అవార్డు

గుడివాడ రూరల్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): గుడివాడలోని శ్రీ సాయి షైనింగ్ స్టార్ స్కూల్‌కి జాతీయ స్థాయి అవార్డు లభించింది. బ్రెయిన్ ఫీడ్ టెక్ ఎక్స్ హైదరాబాద్ సంస్థ డిసెంబరు 6వ తేదీన పాఠశాల చైర్మన్ లింగమనేని జగదీష్, ప్రిన్సిపాల్ లింగమనేని స్రవంతిలకు ఈ అవార్డు అందజేశారు. ప్రిన్సిపాల్ లింగమనేని స్రవంతి మాట్లాడుతూ అతి తక్కువ కాలంలోనే జాతీయ స్థాయి ఉత్తమ అవార్డు రావటం పాఠశాలల విద్యార్థులు, తల్లిదండ్రుల కృషి కారణమన్నారు. మండలంలోని అనేక గ్రామాల నుంచి పట్టణం నుండి తల్లిదండ్రులు తమ సంస్థను ప్రోత్సహించారని చెప్పారు. విద్యార్థులకు నిపుణులైన ఉపాధ్యాయులచేత బోధన చేయిస్తున్నామన్నారు. చైర్మన్ జగదీష్, ఉపాధ్యాయుల సహకారంతో ఈ ఘనత సాధించినట్లు ఆమె తెలిపారు.



నిరసన తెలుపుతున్న సీపీఐ, ఏఐటీయూసీ నేతలు

అదానీ అవినీతిపై సమగ్ర విచారణ చేపట్టాలి

గుడివాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అదానీ గ్రూపు కంపెనీ, క్రోనీ క్యాపిటిజాన్ని ప్రోత్సహించడంలో కేంద్ర ప్రభుత్వ పాత్రపై పూర్తిస్థాయి దర్యాప్తు చేపట్టాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక గౌరీశంకరపురంలోని సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రకాష్‌బాబు మాట్లాడుతూ, అదానీ గ్రూపు కంపెనీ, క్రోనీ క్యాపటలిజాన్ని ప్రోత్సహించడంలో కేంద్రం పాత్రపై దర్యాప్తు చేయాలని, పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేయాలని, మణిపూర్‌లో హింసాత్మక ఘటనలపై పార్లమెంట్‌లో చర్చ, తదితర డిమాండ్లతో నిరసన చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ, నేతలు పి.రంగారావు, జి.నాగేషు, కె.వెంకటయ్య, జోజి పాల్గొన్నారు.



మహిళల ఖో ఖో విజేతగా నిలిచిన ఏఎన్ఆర్ జట్టు

అంతర్ కళాశాలల మహిళల ఖోఖో విజేత ఏఎన్ఆర్

గుడివాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : శ్రీదుర్గ మల్లేశ్వర సిద్ధార్థ మహిళా కళాశాలలో నిర్వహించిన కృష్ణా విశ్వవిద్యాలయ అంతర్ కళాశాలల మహిళల ఖో ఖో పోటీల్లో స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల జట్టు విజేతగా నిలిచింది. సోమవారం కళాశాలలో విజేతలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. పోటీలో ప్రతిభ కనబరచిన విద్యార్థినులు టి.బాలదుర్గ, కె.అనూష, కె.చైతన్య, ఎం.దుర్గాభవానిలు కాలికట్ యూనివర్శిటీలో జరిగే సౌత్‌జోన్ పోటీలకు కృష్ణా వర్సిటీ జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని ప్రిన్సిపాల్ పి.జె.ఎస్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినులను కళాశాల పాలకవర్గం, విద్యార్థులు అభినందించారు.

మొక్కలు నాటిన ట్రాఫిక్ పోలీసులు



గుడివాడ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆధ్వర్యంలో డాక్టర్స్ అసోసియేషన్ తరపున వైద్యులు పొట్లూరి వంశీకృష్ణ, మాగంటి శ్రీనివాస్‌లతో కలిసి ట్రాఫిక్ ఎస్ఐ ప్రసాద్ సిబ్బందితో కలిసి స్థానిక ఏలూరురోడ్డులోని డివైడర్లలో 'మేము సైతం' కార్యక్రమంలో భాగంగా సోమవారం మొక్కలను నాటారు. ఐ లవ్ గుడివాడ కార్యక్రమంలో భాగంగా మొక్కలను నాటినట్టు ప్రసాద్ తెలిపారు.



కూచిపూడి హెల్త్ క్లినిక్‌లో తనిఖీలు

కూచిపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడిలోని విలేజ్ హెల్త్ క్లినిక్‌లో వైద్యాధికారుల బృందం సోమవారం తనిఖీలు నిర్వహించింది. ఈ సందర్భంగా రోజుకు ఎంతమంది రోగులు వైద్యసేవలు పొందుతున్నారు. సౌకర్యాలు ఎంతవరకు ఉన్నాయి, ఏయే మందులు అందుబాటులో ఉన్నాయి, సిబ్బంది ఎంతమంది ఉన్నారు తదితర విషయాలపై ఆరాతీశారు. డాక్టర్లు చైతన్య, సంధ్య, సయ్యద్ అమీర్ తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.



దత్తు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు

పోరాట యోధుడు కామ్రేడ్ దత్తు

కూచిపూడి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : గొప్ప పోరాట యోధుడు కామ్రేడ్ దత్తు అని సీపీఐ జిల్లా కార్యదర్శి టి.తాతయ్య అన్నారు. కూచిపూడిలోని పార్టీ కార్యాలయంలో దత్తు వర్థంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తాతయ్య మాట్లాడుతూ, భూ పోరాట సమస్యలపై ఆయన పేదల పక్షాన అలుపెరగని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. దత్తు అడుగుజాడల్లో నేటి తరం నేతలు పయనించాలన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దత్తు ట్రస్ట్ తరపున సీనియర్ నేతలు కొండా నాగేశ్వరరావు, కాకుళ్ల జగన్మోహనరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పరుచూరి అజయ్ కుమార్, చెరుకు శ్రీనివాసరావు, కెవి.అప్పారావు, చండోలు నాగేశ్వరరావు, బోరుకాటి నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే అభివృద్ధి..

పమిడిముక్కల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : : విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ప్రతిఒక్కరు విద్యావంతులైతేనే చైతన్య వంతులుగా జీవించవచ్చని ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. ముదిరాజుపాలెంలో రూ.12 లక్షల అంచనాతో నిర్మించిన ఎంపీపీ ప్రాథమిక పాఠశాల నూతన భవనాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి ప్రయోజకులు కావాలన్నారు. సర్పంచ్ వీరంకి బులుసుమ్మ తదితరులు పాల్గొన్నారు.



బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	104, 112, 123
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.625

భూ, సర్వే సమస్యలు పరిష్కరించండి : గోపు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పట్టా భూములు సెక్షన్ 22ఏ నిషేధిత భూముల జాబితాలో ఉంటే వాటిని తొలగించాలని, సర్వే నెంబరు, సబ్ డివిజన్లలో తప్పులు ఉంటే సవరించాలని, ఈనాం భూమిగా నమోదైన పట్టా భూములను సవరించాలని జిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ కోరారు. బందరు మండలం మేకావారిపాలెం జరిగిన సదస్సులో డీటీ డిటి సత్య నారాయణకు వినతిపత్రం సమర్పించారు. టీడీపీ నాయకులు కుంచే నాని, తలారి సోమశేఖర్, వాలిశెట్టి తిరుమలరావు, జొన్నల పాండురంగారావు, కూనపరెడ్డి బాబు, సూర్యనారాయణ, ఆర్‌ఐ రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పైడమ్మ జాతరను విజయవంతం చేయాలి

పెడన, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : అధికారులు సమన్వయంతో పనిచేసి పైడమ్మ జాతరను విజయవంతం చేయాలని తహసీల్దార్ కూనపరెడ్డి అనిల్‌కుమార్ సూచించారు. ఈనెల 14 నుంచి 24 వరకు పట్టణంలో జరగనున్న పైడమ్మ తల్లి జాతరపై అనిల్‌కుమార్ తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉత్సవ ప్రాంగణాన్ని ప్రతిరోజూ పరిశుభ్రంగా ఉంచాలన్నారు. డీజేలను, తీన్మార్ వాయిద్యాలను ఆలయం వద్దకు అనుమతించవద్దన్నారు. ఉత్సవాలు జరిగే 11 రోజులు శాంతిభద్రతలకు భంగం కలగకుండా పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. ఈనెల 23నఅమ్మవారి తెప్పోత్సవానికి ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలన్నారు. పంటుపైకి ఎక్కువ మందిని అనుమతించవద్దని సూచించారు. దేవస్థానం ఈవో టి.వి.వి.మోహనరావు, సీఐ నాగేంద్రప్రసాద్, ఎస్సై-2 రాజేంద్రప్రసాద్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాద బాధితులకు ఎమ్మెల్యే కాగిత పరామర్శ

మచిలీపట్నం/ గూడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పామర్రు మండలం కురుమద్దాలి ఫ్లైఓవర్ వద్ద ఆటో టైర్ పగలడం మల్లవోలుకు చెందిన కూలీలు . 14 మంది తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ జగన్నాథరావు తదితరులు బాధితులను పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. కొనకళ్ల నాగరాజు, ఆరీఫ్, ఖదీర్, మహేష్, సిహెచ్. నారాయణ గూడూరు మండల టీడీపీ అధ్యక్షుడు పోతన స్వామి, గోపీ నాగబాబు, బత్తిన వీరబాబు, పోతుల రాము, పూల నాగరాజు ఉన్నారు.

కరకట్ట విస్తరణ బాధితులకు పరిహారం చెల్లించాలి

మోపిదేవి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మోపిదేవి వార్పు నుంచి విజయవాడ వరకు కృష్ణానది కరకట్ట విస్తరణలో భాగంగా ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న భూమికి నష్టపరిహారం చెల్లించాలంటూ రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ ఎస్.శ్రీవిద్యకు మత్తి గురు ప్రసాద్ అర్జీని అందజేశారు. 2016లో కృష్ణానది కరకట్ట విస్తరణలో భాగంగా కొక్కిలిగడ్డ గ్రామ రెవెన్యూ పరిధిలో కొంతమేర భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని, నాటి నుంచి పరిహారం అందించటం లేదన్నారు. భూమికి సంబంధించి పత్రాలను రెవెన్యూ అధికారులు తారుమారు చేయటంతో వేరే వ్యక్తికి నగదు జమ అయినట్లు సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకున్నామన్నారు ఎనిమిదేళ్లుగా కార్యాలయాల చుట్టూ తిరిగినా ఏ ఒక్క అధికారి పట్టించుకోవటం లేదన్నారు. సర్పంచ్ దిడ్ల జానకి రాంబాబు, మండల పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, చల్లపల్లి గ్రూపు దేవాలయాల కార్యనిర్వహణాధికారిణి జోగి ప్రవీణ, మండల సర్వేయర్ రామకృష్ణ, వీఆర్వో వరప్రసాద్, కార్యదర్శి రవికుమార్ తదితరులు ఉన్నారు.

పూడిన డ్రైనేజీ ఎన్‌హెచ్ అధికారుల పరిశీలన

మోపిదేవి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెదప్రోలులో ఉన్న మురుగునీటి డ్రెయిన్ ఆక్రమణలకు గురై పూడ్చివేశారని రైతులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో జాతీయ రహదారుల విభాగం రెసిడెంట్ ఇంజనీర్ సుధీర్, హైవే క్వాలిటీ కంట్రోల్ ఇంజనీర్ శ్రీను సోమవారం డ్రైనేజీని పరిశీలించారు. గ్రామస్థులు, రెవెన్యూశాఖ సహకరిస్తే ఆక్రమణలు తొలగించి డ్రెయిన్‌ను విస్తరించటం జరుగుతుందన్నారు. పూర్తిస్థాయి నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామన్నారు. డ్రైనేజీని పూడ్చివేయటంతో వందలాది ఎకరాలు తరచూ ముంపుకు గురై నష్టపోవాల్సి వస్తుందని రైతులు తెలియజేశారు. టీడీపీ నాయకులు నాదెండ్ల శరత్ చంద్ర ప్రసాద్, డొకిపర్తి బాలకోటేశ్వరరావు, కేశాని సురేష్, పలువురు రైతులు ఉన్నారు.



కూరగాయల విత్తనాలు పంపిణీ చేసి ప్రజలకు అవగాహన కల్పిస్తున్న విద్యార్థినులు

పెరటి తోటల పెంపకం ఎంతో లాభదాయకం

మోపిదేవి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద ఉండే మహిళలు పెరటి తోటల పెంపకంపై దృష్టి సారిస్తే ఆర్థికంగా ఎంతో ప్రయోజనం పొందుతారని బాపట్ల వ్యవసాయ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ కో- ఆర్డినేటర్ డాక్టర్ సంధ్య, డాక్టర్ స్వప్న తెలిపారు. బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు క్షేత్రస్థాయి సందర్శనలో భాగంగా సోమవారం రావివారిపాలెంలో ఇంటింటికి కూరగాయల విత్తనాలు పంపిణీ చేసి పెరటి తోటల పెంపకంపై అవగాహన కల్పించారు. పెరటితోటల్లో సాగు చేసే బెండ, తోటకూర, పాలకూర, బీరకాయ విత్తనాలను అందించి వాటిని స్వయంగా నాటి మహిళలకు అవగాహన కల్పించారు. రసాయనిక ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో మొక్కలు నాటాలన్నారు. గ్రామస్థులు జొన్నలగడ్డ పిచ్చేశ్వరరావు, రామ్మోహనరావు, వేములపల్లి పిచ్చేశ్వరరావు, కళాశాల విద్యార్థులు ఉన్నారు.

కాపు సంక్షేమ భవనం శిలాఫలకాన్ని పునరుద్ధరించాలి

కోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : కాపు సంక్షేమ భవనం శిలాఫలకాన్ని పునరుద్ధరించాలని కాపు సంఘ నేతలు కోరారు. సోమవారం కోడూరు గ్రామపంచాయతీ కార్యదర్శి బండే శేషగిరిరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. రూ.50 లక్షలతో కాపు సంక్షేమ భవనాన్ని నిర్మించేందుకు 2019 సంవత్సరంలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శిలాఫకాన్ని ఆవిష్కరించి, శంకుస్థాపన చేశారని తెలిపారు. నిర్మాణం జరగకపోవటంతో ప్రస్తుతం శిలాఫలకంవిరిగిపోయిందన్నారు. బడే వెంకటేశ్వరరావు, బడే మధు, జరుగు నారాయణ పాల్గొన్నారు.



పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న కాపు సంఘంనేతలు

గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన

కోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఆడపిల్లలను తాకకూడని చోట ఎవరైనా తడిమితే భయపడకుండా డోంట్ టచ్ మీ అని చెప్పాలని, అక్కడ నుంచి వెంటనే వెళ్లిపోవాలని, జరిగిన విషయాన్ని తల్లిదండ్రులకు చెప్పాలని ఎస్సై కె.చాణక్య అన్నారు. లింగారెడ్డిపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో సోమవారం బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, మానవ అక్రమ రవాణా నియంత్రణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సూచించారు. మత్తు పదార్థాల వల్ల జరిగే నష్టాల గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు కోడూరు నాగరత్నకుమారి, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై చాణక్య

కోడూరులో కుక్కల బెడద

- ఏ వీధిలో చూసినా గుంపులు, గుంపులుగా స్వైర విహారం
- పాదచారులు, వాహనదారులపై దాడి



నరసింహాపురం రోడ్డులో గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

(ఆంధ్రజ్యోతి-కోడూరు)

కోడూరులో కుక్కల స్వైరవిహారం చేస్తున్నాయి. వీధుల్లోకి వెళ్లాలంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. రాత్రనక, పగలకనా గ్రామ సింహాలు గుంపులు గుంపులుగా తిరుగుతూ హడలెత్తిస్తున్నాయి.

మండల కేంద్రానికి వివిధ గ్రామాల నుంచి ప్రజలు రావడానికి భయపడుతున్నారు. కోడూరు సంత మార్కెట్, నరసింహాపురం రోడ్డు, పలు వీధుల్లోనూ, ప్రధాన రహదారులపైన కుక్కలు గుంపులు గుంపులుగా సంచరిస్తూ పాదచారులు, వాహనదారులపై దాడి చేస్తున్నాయి. కుక్కలు మీదపడడంతో వాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. రాత్రి సమయాల్లో ఏ వీధికి వెళ్లాలన్నా స్థానికులే భయపడుతున్నారు.

గ్రామ పంచాయతీ, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కుక్కలకు కుటుంబ నియంత్రణ చర్యలు చేపడతంతో పాటు, వీధి కుక్కలను తీసుకెళ్లి అటవీ ప్రాంతాల్లో వదిలి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు.



కోడూరు ప్రధాన సెంటర్‌లో గుంపులుగా వెళ్తున్న కుక్కలు

సభ్యత్వ నమోదు వేగవంతం చేయండి

- నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి

అవనిగడ్డ, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సభ్యత్వ నమోదు మరింత వేగవంతం చేయాలని నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. పార్టీ కార్యాలయంలో సభ్యత్వ నమోదు కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు.

కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఓటర్లలో కనీసం 30 శాతం మంది సభ్యత్వం తీసుకునేలా కృషి చేయాలన్నారు. రానున్న సాగునీటి సంఘాల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని మండలాల్లో సమర్థులైన వారిని సాగునీటి సంఘాల అధ్యక్షులుగా ఎంపిక చేసేలా గ్రామ, మండల, నియోజకవర్గ పార్టీలు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు.

మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మండవ బాలవర్థిరావు, జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీల అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, మెండు లక్ష్మణరావు, మోర్ల రాంబాబు, మాజీ సీడీసీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, నిడమానూరి దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మోదుమూడిలో..

మోదుమూడిలో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. టీడీపీ జిల్లా కార్యదర్శి బచ్చు రఘునాథ ప్రసాద్, టీడీపీ గ్రామ కన్వీనర్ బచ్చు నాగమల్లి, తోట సురేష్, బచ్చు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వం కార్యకర్తలకు అండ

కోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ సభ్యత్వం తీసుకోవటం వల్ల కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటుందని మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు అన్నారు. పార్టీ కార్యాలయం వద్ద సభ్యత్వ నమోదు నిర్వహించారు. సభ్యత్వ నమోదు వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వేములపల్లి శ్రీకృష్ణ, అప్పికట్ల రవీంద్రబాబు, వేములపల్లి రాజేష్, మహమ్మద్ ఇమ్రాన్, ఆరే గాంధీ తదితరులు పాల్గొన్నారు.

పెదయాదర హత్యాయత్నం కేసు కొట్టివేత

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం పెదయాదర సొసైటీ మాజీ అధ్యక్షుడు, ఆయన కుమారుడిపై జరిగిన హత్యా యత్నం కేసును కొట్టివేస్తూ సోమవారం కృష్ణాజిల్లా తొమ్మిదో అదనపు జిల్లా జడ్జి ఎస్.సుజాత తీర్పు చెప్పారు. పెదయాదర సొసైటీ మాజీ అధ్యక్షుడు, మాజీ సర్పంచ్ భర్త కంచర్లపల్లి పిచ్చయ్య (67), అతని కుమారుడు కంచర్లపల్లి ధన్వంతరీ (30)లపై పాతకక్షలను పురస్కరించుకుని అదే గ్రామానికి చెందిన కంచర్లపల్లి బాలనాగేశ్వరరావు, కంచర్లపల్లి వెంకటేశ్వరరావు, కంచర్లపల్లి హరిబాబు, కోసూరు లక్ష్మీ నాంచారయ్య, శ్రీపతి శ్రీనివాసరావు, అర్జా బాలాజీ, అర్జా మారుతి, బొమ్మసాని శ్రీనివాసరావు, రెబ్బా వెంకటేశ్వరరావు మారణాయుధాలతో దాడి చేశారని బందరు తాలూకా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాదోపవాదాలు విని ప్రాసిక్యూషన్ విఫలం కావడంతో కేసును కొట్టివేస్తూ జడ్జి తీర్పు ఇచ్చారు.

మహిళ గర్భసంచిలో రెండు కిలోల కణితి

- విజయవంతంగా తొలగించిన డాక్టర్ కీర్తి



చల్లపల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మహిళ గర్భసంచిలో రెండు కిలోల కణితిని చల్లపల్లి కీర్తి హాస్పటల్ వైద్యురాలు డాక్టర్ నల్లపనేని కీర్తి శస్త్ర చికిత్స చేసి విజయవంతంగా తొలగించారు. ఘంట సాల మండలం చిట్టూర్పు గ్రామానికి చెందిన పరుచూరి షాలినికి స్కానింగ్ చేయగా గర్భసంచిలో గడ్డ ఉన్నట్లు నిర్ధారణ అవటంతో శస్త్రచికిత్స చేయించుకోవాలని సూచించారు. డాక్టర్ కేశవకృష్ణ, డాక్టర్ కృష్ణ, డాక్టర్ భవానీప్రసాద్ సహకారంతో ఆపరేషన్ చేసి మహిళ గర్భసంచిలో కణితిని డాక్టర్ కీర్తి విజయవంతంగా బయటకు తీశారు. ఆపరేషన్ చేయించుకున్న మహిళ ఆరోగ్యంగా ఉండటంతో హాస్పటల్ నుంచి డిశ్చార్జ్ చేసినట్లు డాక్టర్ కీర్తి తెలిపారు.

ఎల్ఐసీ ఏజెంట్ల సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మచిలీపట్నం ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద సోమవారం 2500 మంది ఏజెంట్లు మహాధర్నా నిర్వహించారు. నగరంలో ర్యాలీ నిర్వహించారు. ఎల్ఐసీ ఏజెంట్ల జోనల్ సంఘ ఉపాధ్యక్షుడు సమ్మెట రాంబాబు మాట్లాడుతూ, జీవిత బీమా ఏజెంట్ల కమిషన్ పెంచాలన్నారు. ఏజెంట్ల డిమాండ్లను సత్వరం పరిష్కరించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామన్నారు. జీఎస్టీ రద్దు చేయాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. డివిజన్ ఏజెంట్ల సంఘం అధ్యక్షుడు నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, కార్యదర్శి రవీందర్‌రెడ్డి, కోశాధికారి జగన్నాథరావు, ఏజెంట్లు పాల్గొన్నారు.



ఘనంగా సెమీ క్రిస్మస్

ఘంటసాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఘంటసాలలో గిల్గాలు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ కావూరి దేవమణి ధనరాజు ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. బ్రదర్ సెల్వీ మాట్లాడుతూ క్రీస్తు బోధనలు ప్రతి ఒక్కరూ అనుసరించాలన్నారు. పాస్టర్ కావూరి నవీన్ బాబు అధ్యక్షతన జరిగిన వేడుకల్లో క్రిస్మస్, క్రైస్తవ ఆధ్యాత్మిక గీతా లు ప్రజలను ఆకట్టుకున్నాయి. పాస్టర్లు కె.దైవ ప్రకాష్ బాబు, దానియేలు రాజు, సతీష్ పాల్, గొరై పాటి రంగారావు, చంటిబాబు, సురేష్, మేరి మ్మ, రాణిమ్మ, ప్రమీలమ్మ, జమున, రమ్య సుకీర్తి, హనోక్ పాల్గొన్నారు.



పాఠశాలకు కంప్యూటర్ అందజేస్తున్న బడే వీరవెంకటరావు

జడ్పీ ఉన్నతపాఠశాలకు కంప్యూటర్ వితరణ

కోడూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బడేవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త బడే వీర వెంకటరావు - నాగమణి దంపతుల కుమారుడు బద్రీనాథ్, కుమార్తె నిహారిక(అమెరికా) రూ.30 వేలు విలువ చేసే కంప్యూటర్, ప్రింటర్‌లను పాఠశాలకు అందజేశారు. వీర వెంకటరావు సోదరుడు బడే వీరాంజనేయు స్వామి జ్ఞాపకార్థం వీటిని అందజేసినట్లు దాత వెంకటరావు తెలిపారు. దాతలను ఎంఈవోలు టి.వి.ఎం.రామదాసు, వి.శ్రీనివాసరావు అభినందించి సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దోనే రాధాకృష్ణ, మండల జనసేన పార్టీ అధ్యక్షులు మర్రే గంగయ్య, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పూతబోయిన సీతారత్న సాయి బాబు, మండల జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తోట సోమశేఖరరావు, గాదె విజయ భాస్కర్, టీడీపీ నేతలు కాగిత రామారావు, గాదె భాస్కరరావు పాల్గొన్నారు.



విద్యార్థులతో మోటివేటర్ అరవింద్ సత్య

సామాజిక పరిస్థితులపై విద్యార్థులకు అవగాహన

బంటుమిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : సామాజిక పరిస్థితుల పట్ల విద్యార్థులకు అవగాహన ఎంతో అవసరం అని ప్రముఖ మోటివేటర్ అరవింద్ సత్య అన్నారు. బంటుమిల్లి, పెందుర్రు జిల్లా పరిషత్ హైస్కూల్లో అవగాహన కల్పించారు. ఆహారం, ఆరోగ్యం, సంస్కృతి, సంప్రదాయాల విషయంలో ప్రతి ఒక్కరూ భారతీయ సనాతన ధర్మాన్ని పాటించాలన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, వెంకట్రావ్, సుబ్రమణ్యేశ్వరరావు, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదిరులు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో కొమ్మారెడ్డి విద్యార్థుల ప్రతిభ



బంటుమిల్లి, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ - 2024 పోటీల్లో కొమ్మారెడ్డి పాఠశాల విద్యార్థులు విజయకేతనం ఎగుర వేశారు.. ఆదివారం గుంటూరు మున్సిపల్ స్టేడియంలో జరిగిన పోటీల్లో ఎనిమిదేళ్ల కటా విభాగంలో ఎం.డి పర్హన్ ప్రథమ, తొమ్మిదేళ్ల కటా విభాగంలో కేఎల్‌జీఎస్ హర్షిణి ప్రథమ స్థానం కైవసం చేసుకున్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను స్కూల్ డైరెక్టర్ కొమ్మారెడ్డి కిషోర్, కరస్పాడెంట్ శోభ, ప్రిన్సిపాల్ ఎన్ శ్రీనివాసరావు, కరాటే కోచ్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిండ్రులు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

బీజామృతం తయారీపై అవగాహన

ఘంటసాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ఘంటసాలలోని కృషి విజ్ఞాన కేంద్రంలో సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రేవతి ప్రకృతి వ్యవసాయంలో భాగంగా బీజామృతం తయారీ విధానాన్ని వివరించారు. బీజామృతం వివిధ పంటలలో తక్కువ ఖర్చుతో విత్తనశుద్ధికి, కూరగాయ మొక్కల నారు శుద్ధికి వినియోగించుకోవచ్చునన్నారు. తద్వారా చీడ పీడలు నుంచి పంటకు రక్షణ కలుగుతుందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటలక్ష్మి, డా.నవీన్, యశ్వంత్ కుమార్, కృష్ణవేణి, యూనిట్ ఇన్‌చార్జ్ నాగరాజు, శ్రీను, రవీంద్ర, రైతులు పాల్గొన్నారు.

మానవ హక్కులను పరిరక్షించాలి

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : మానవ హక్కులను పరిరక్షించాలని మానవ హక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కె.వి.వి.సత్యనారాయణ అన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం సందర్భంగా బందరు ప్రభుత్వాసుపత్రిలో బాలింతలు, పిల్లలకు పండ్లు పంచి పెట్టారు. స్టార్ కళాశాల డైరెక్టర్ అయ్యప్ప స్వామి, ఆదిత్య, రాజ్యలక్ష్మి, ఆదిలక్ష్మి, ఎన్. దేవిక, టి. శిరీష, రాగి చంద్రశేఖర్, బోలెం వెంకటేశ్వరరావు, ఎంపీఎస్ కుమార్, వీరంకి ప్రసాద్, ఆసుపత్రి వైద్యులు పాల్గొన్నారు.

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల ధర్నా

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పెండింగ్ జీతాలు చెల్లించాలంటూ మునిసిపల్ కాంట్రాక్టు కార్మికులు సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు బి. సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో జిల్లా కార్యదర్శి నాగమల్లేశ్వరరావు, పి. వెంకటేశ్వరరావు, సంజీవమ్మ, విజయ, కృష్ణవేణి, శ్రీనివాస్, తాడిశెట్టి శ్రీను, అంకయ్య, లలిత తదితరులు పాల్గొన్నారు.

కొల్లు పునీత్ జన్మదిన వేడుకలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఆబ్కారీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర కుమారుడు కొల్లు పునీత్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. టీడీపీ అసెంబ్లీ నియోజకవర్గ కార్యాలయంలో పార్టీ నాయకులు కేకు కట్ చేశారు. దేవాలయాల్లో కొల్లు పునీత్ పేరిట అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.

వీఆర్వో ఫిర్యాదుపై కేసు నమోదు

ఘంటసాల, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : పాపవినాశనం సీఆర్‌జెడ్ పరిధిలో వీఆర్వో శివప్రసాద్‌ను దూషించిన వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రతాప్ రెడ్డి తెలిపారు. పాపవినాశనం కృష్ణా నది రేవు వద్ద శనివారం రాత్రి ఎక్స్‌కవేటర్ కొంతమంది వ్యక్తులు ఉండటంతో గమనించి దానిని స్టేషన్‌కు తరలించే క్రమంలో కొండలు, రామయ్య, పోతురాజు తనను దూషించినట్లు వీఆర్వో ఫిర్యాదు చేశారు. జేసీబీ డ్రైవర్ మణికంఠపై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.